శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై!   సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబూజీ కీ జై!



"ధ్యాన మూలం గురోర్మూర్తిః పూజా మూలం గురోః పదం
మంత్ర మూలం గురోర్వాక్యం ముక్తిమూలం గురోఃకృపా"

ధ్యానానికి మూలం గురు స్వరూపం, పూజకు మూలం గురుచరణాలు.
మంత్రం అంటూ ఏదైనా లభించిందీ అంటే అది మన గురుదేవుల వాక్యాలే.
ముక్తికి... గురుకృప



న గురోరధికం తత్త్వం... న గురోరధికం తపః
నగురోరధికం జ్ఞానం... తస్మైశ్రీ గురువేనమః

గురువుని మించిన సత్యవస్తువు ఇంకొకటి లేదు.
గురుసేవను మించిన తపస్సు లేదు.
గురుబోధను మించిన జ్ఞానం లేదు. అట్టి గురువుకు నమస్కారం.



# కృప

గురుపూర్ణిమ సంచిక

గురువుని కృతజ్ఞతా పూర్వకముగా ఆరాధించే
పర్వదినమును "గురుపూర్ణిమ" అంటారు.



# గురువు అంటే...

ఒకరోజు ఒకాయన రమణమహర్షి దగ్గరకు వెళ్లి "గురువు అంటే ఎవరు?" అని అడిగాడు. రమణులు "గురువు అంటే ఎవరు కాదు 'ఏమిటి?' అని అడగాలి" అన్నారు. ఆయన మరలా "గురువు అంటే ఏమిటి?" అని అడిగాడు. "గురియే గురువు" అన్నారు రమణులు. 'గురి' అన్న తత్త్వమే 'గురువు'. గడ్డిపోచనైనా 'నమ్ము'కో... అది నిన్ను గమ్యం చేరుస్తుంది అంటారు శ్రీసాయి. నమ్మకమే నిన్ను గమ్యం చేర్చేది. ఆ నమ్మకమే గురువు కదా!

సద్గురువే మనల్ని ఎన్నుకుంటారు. సద్గురువు అంటే ఏమిటి? బాబా ఎవరు? ఆయన నిన్నే ఎందుకు ఎంచుకున్నారు? బాబా యొక్క తత్త్వమేమిటి? అనే విషయాలు తెలుసుకొని బాబాకి ఇంకా దగ్గరకావడం. అది మాత్రం నువ్వే చేయాలి. కాబట్టి తెలుసుకో అన్నారు శ్రీబాబూజీ.

సద్గురువు అంటే ఏదైతే నీలో ప్రేమను ప్రజ్వలింపచేస్తుందో, ఏదైతే నిన్నొక వ్యక్తిగా మలచి నీ ఆశయసిద్ధిని తెలియని రీతిలో అనుభవింపచేస్తుందో, ఏదైతే నీలో ఆనందం, ప్రశాంతి, నమ్మకం, రక్షణ మొదలైన భావాలను కలుగచేస్తుందో అదే సద్గురువు. అసలు ఏం జరుగుతున్నదో నీకు తెలియదు. జరుగుతున్న దానికి ఆధారం కానీ, ప్రమాణం కానీ ఉండదు. కానీ అది నీ అనుభవంలోకి వస్తుంది. దానినే సద్గురువు అంటారు శ్రీబాబూజీ.

"గురుతు చెప్పేవాడు గురువు" అంటారు ఓ మహాత్మురాలు. గురువు చెప్పిన గురుతును మనం గట్టిగా పట్టుకోవాలి. అంటే వారు చెప్పిన దానిని (ఉపదేశం, ఆదేశం, సందేశం) మన జీవితంలో శ్రద్ధగా ఆచరించాలి. సద్గురువు అంటే ప్రేమ, ఆనందం, అనుభవం, అనుభూతి, రక్షణ, శిక్షణ, ఆలన, లాలన, పాలన, గురి, నమ్మకం, గురుతు, ఎరుక, విశ్వాసం...

"గురువు శిష్యుడన్న గుడ్డెద్దు చేనురా విశ్వదాభిరామ వినురవేమా" అని యోగి వేమన మొత్తుకొన్నాడు. (కాకా దీక్షిత్, మేక వృత్తాంతం మనకు తెలిసినదే కదా) వారు చెప్పేదానిలో కనబడని లోతైన అర్థం ఉంటుంది. (నా చర్యలు అగాధాలు - శ్రీసాయి) గుడ్డిగా గురువు చెప్పింది నమ్మి ఆచరిస్తే అదే మనల్ని ఉన్న స్థితి నుంచి ఉన్నతస్థితికి చేరుస్తుంది. మహోన్నత స్థాయికి తీసుకెళుతుంది. ఆ ఆచరణే నేడు కరువయింది. ఒక రాయిని నమ్మినా, మన నమ్మకంలో లోపం లేకుంటే అదే మనల్ని గమ్యం చేరుస్తుంది. మనకు తెలిసిన ఏకలవ్యుని వృత్తాంతం- గురువు ప్రతిమను పెట్టుకొని, నమ్మికతో ఆచరించి, ప్రత్యక్ష సన్నిధిలో శిక్షణ పొందిన శిష్యునికంటే ప్రతిభావంతుడయ్యాడు. కాకాదీక్షిత్, మేక వృత్తాంతం బాబా చరిత్రలో ఇది మనం చదువుకున్న వారమే. దీన్ని మనం ఎంత అర్థం చేసుకున్నామన్నదీ, ఎంత ఉపయోగపడింది అన్నది మన జీవితంలో ఆచరణగా వ్యక్తమవుతుంది. అందుకే గురువుగారు చెబుతారు. పారాయణ అన్న అంశంలో బాబా చరిత్ర మనకేమిచ్చింది? అన్న ప్రశ్నకు (మొదటి ప్రశ్నగా) సమాధానంగా అన్వేషణగా సాగాలి అని. భగవంతుని చేరే మార్గం చూపేదే నిజమైన విద్య (ఆధ్యాత్మికత). అక్కడకు ఎలా చేరాలో నడిచిచూపేవారే (ప్రాక్టికల్‌గా) అసలైన గురువు" అన్నారు మరో మహాత్ముడు.




సంపుటి : 18
జూలై 31

సంచిక : 3
2015



# కృప



## సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీధిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృత ధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృత ధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్య ప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

\- శ్రీబాబూజీ



## లోపలి పేజీలలో


గురువు అంటే... 2
\- ఉన్నమాట–అనుకున్నమాట

ఎంపిక 19
\- శరశ్చంద్రికలు

కోరికలు అవరోధాలా? 4
\- శరశ్చంద్రికలు

సగుణం - నిర్గుణం 28
\- శరశ్చంద్రికలు

పని-ప్రేమకు ఓ చక్కని వ్యక్తీకరణ 11
\- శరశ్చంద్రికలు

గురుకృపాలహరి 36
\- గురుకృప



నిర్వహణ : *గురూజీ ఆశీస్సులతో - గురుబంధువులు*
**GURUKRUPA**
Printed at : Ramakrishna Printers, Visakhapatnam.




## కోరికలు అవరోధాలా? లేక సాయిపథ సోపానాలా? ఏప్రిల్ 2015



**భక్తుడు :** గురువుగారూ! ఒక వ్యక్తిలోని భావోద్వేగాలు ఒక సంపూర్ణమైన పొందికకు వచ్చి ఆ వ్యక్తికి పరిపూర్ణమైన ఆనందం అనుభవమైనప్పుడు, ఆ వ్యక్తికి ఆ స్థితిలో కూడా కోరికలు ఉంటాయా?

**గురువుగారు :** ఆ స్థితిలో కోరిక అనే అనుభవం అంటూ ఏదీ ఉండదు. ఆ పరిపూర్ణత్వమనేది కోరికలేవీ లేని స్థితిగా అనుభవమవుతుంది. ఏ కోరికలూ లేకపోవడమే పరిపూర్ణత్వమంటే. కోరిక ఉన్నదంటే ఏదో కొరత, ఏదో శూన్యత్వం, ఖాళీ ఉన్నట్లు లెక్క. అది పూర్ణం కావాలి. ఆ కొరత పూర్తిగా తీరినప్పుడు మనం నిజాయితీగా, "ఇక నాకు కావాల్సిందేముంది, ఏమీ లేదు" అనగలం. అది మన పూర్ణత్వస్థితి.

ఇదెలా ఉంటుందంటే, ఒకసారి భగవాన్ దగ్గరకు ఒకామె వచ్చి, "భగవాన్, నాకేమీ అక్కరలేదు. ఆ 'ముక్తి' అంటారే దాన్నివ్వండి. నా మిగతా కోరికలన్నీ తీరిపోయాయి" అని అడిగింది. దానికి భగవాన్, "ఊఁ సరి, సరి" అన్నారు. ఆమె తిరిగి మళ్ళీ "భగవాన్, నాకు ఇంకేమీ కోరికలు లేవు. నాకు మోక్షాన్ని ఇవ్వండి, నేను బయలుదేరాలి" అన్నది. దానికి భగవాన్, "ఊ" అని మాత్రం అన్నారు. ఆ తరువాత ఆమె ఆ గది నుండి వెళ్ళిపోయింది. ఆమె అట్లా గది నుండి వెళ్ళిందో లేదో, భగవాన్ సోఫామీద (దొర్లుతూ) పొట్టపట్టుకుని పగలబడి నవ్వసాగారు. అక్కడున్న మిగతా భక్తులకు ఏం అర్థంకాక భగవాన్ అలా ఎందుకు నవ్వుతున్నారో తెలియక ఆశ్చర్యపోయారు. వాళ్ళు భగవాన్‌తో, "భగవాన్, ఆమె అడిగినదానికి మీరెందుకలా నవ్వుతున్నారు, అందులో తప్పేముంది? మేము కూడా వచ్చింది మోక్షం కోసమే కదా" అన్నారు. అప్పుడు భగవాన్ వారితో ఇలా అన్నారు : "ఎవరైనా నిజంగా కోరికలు లేని స్థితిలో ఉంటే, వారికి నిజంగా ఏమీ అవసరం లేకపోతే, ఇక మిగిలేది కేవలం మోక్షం మాత్రమే. ఇక నేను ఆమెకు ఇవ్వడానికి ఏముంటుంది?

**గురువుగారు :** "ముందు మీరు అన్ని కోరికలను విడిచిపెట్టండి. మీ లౌకిక బంధాలను వదులుకోండి, ప్రాపంచిక విషయాలకు అతీతమైన, స్వచ్ఛమైన, ప్రశాంతమైన మనస్సుతో నా దగ్గరకు రండి. అప్పుడు మీరు ముక్తిని పొందేందుకు అర్హులవుతారు. నేను మీకు ముక్తినిస్తాను!' అని ఎవరైనా




అంటే అవి అసంబద్ధమైన మాటలు. ఒక వ్యక్తి కోరికల నుండి విముక్తుడైపోతే ఆ తరువాత ఇక అక్కడ ఇవ్వడానికేముంది? (గురువుగారు నవ్వుతూ..) అందుకనే ఎవరైనా మీతో ఇలాంటి మాటలు మాట్లాడితే అలాంటి వారిని నమ్మకండి.

ఒక సాధకునికి కోరికలు ఉన్నంతవరకు, సద్గురువు ఆ సాధకుని స్థాయికి దిగివచ్చి, అతను దేనికోసం ప్రయత్నిస్తున్నాడో తెలుసుకొని, దానిని ఇవ్వగలగాలి. ఒకవేళ మీరు ప్రాపంచికమైన విషయాలు కోరుకుంటే సద్గురువు వాటిని ఇవ్వగలగాలి. మీరు భావోద్వేగాలకు సంబంధించిన విషయాలు కోరుకుంటే వాటినీ ఇవ్వగలగాలి. ఆధ్యాత్మికమైన విషయాలు కోరుకుంటే దానికీ సిద్ధంగా ఉండాలి. అంతేగానీ, “నేను కేవలం ముక్తి మాత్రమే ఇస్తాను, అదే నా ప్రత్యేకత, ఇక మిగతా వాటి గురించి నాతో మాట్లాడకండి! (నవ్వులు) మీరన్నీ వదులుకొని నా వద్దకు వస్తే అప్పుడు నేను మీకు సాయం చేస్తాను” అనకూడదు. ఈ రోజులలో మనం ఎక్కువగా ఇటువంటి మాటలు వింటూ ఉంటాం. భగవాన్ ఈ మాటలు వింటే నవ్వి ఉండేవాళ్ళు.


బాబా చెప్పింది కూడా ఇదే. “నా భక్తులు అడిగినవన్నీ నేను ఇస్తాను. నేను ఇవ్వదలచింది వారడిగేంతవరకు!” అన్నారు. ఆయన ఇవ్వదలచుకున్నదేమిటో ఆయన ఎప్పుడూ చెప్పలేదు. బాబా కేవలం అంతవరకు మాత్రమే చెప్పారు. చాలామంది బాబా వద్దకు రకరకాల కోరికలతో వచ్చారు, ఆయనదృష్టిలో అన్ని కోరికలూ సమానమే. ఒకటి ఎక్కువని, ఒకటి తక్కువని తారతమ్యాలేవీ లేవు. ఆయన ప్రతి ఒక్కరి స్థాయికి దిగివచ్చి వారి వారి స్థాయిలలో వారి కోరికలను నెరవేర్చి, చేయి పట్టుకునిముందుకు నడిపించి తమ స్థాయికి తీసుకువెళతారు. అంతేగానీ ఆయన పర్వతశిఖరం మీద కూర్చొని, “పైకి రండి, మీరు వస్తే నేను మీకు ఈ పర్వతాన్నంతా చూపిస్తాను” అని చెప్పరు.

**భక్తుడు :** గురువుగారూ! ముక్తి కావాలి అనే కోరికను బలీయం చేసుకోవడం ఎలా?

**గురువుగారు :** ఆ పని సద్గురువు చేస్తారు. ప్రతి పనికీ ఆయన పద్ధతి ఆయనకుంటుంది. ఆయన తమ మహిమతో రకరకాల పరిస్థితులు కల్పించి మనలోని కోరికలను అప్రయత్నంగా బయటకు తీసుకువచ్చి వాటిని నెరవేరుస్తారు. అంతేగానీ వాటిని అణగద్రొక్కడంగాని, వాటిలో ఎక్కువ కూరుకుపోయేలా చెయ్యడంగానీ చెయ్యరు. ఒక్కసారి ఆ కోరికలు తీరిపోయాక వాటిపట్ల ఉండే ఆకర్షణ పోతుంది. అదే బాబా బోధలోని కీలకమైన అంశం.

మనస్సుకు గల సహజసిద్ధమైన ధర్మాలకు అనుగుణంగా ఆయన మార్గం ఉంటుంది. ఆయన మన కోరికలను నెరవేరుస్తారు. బాబా మనల్ని ఏదీ వదలిపెట్టుకోమని, నాశనం చేసుకోమనీ చెప్పరు.

**అహింసాది ఉత్తమ గుణాలతో, అర్పణ బుద్ధితో పరోపకారం చేయడం మానసిక పూజ.**




"కోరికలు దుఃఖానికి కారణం కాబట్టి వాటిని చంపుకోండి" అనిగాని, "అజ్ఞానానికి కారణం మనస్సు కాబట్టి మనోనాశనం చేసుకోండి" అనిగానీ చెప్పరు. మనం మనస్సును లేకుండా చేసుకోగలిగితే మనం ఆయన దగ్గరకు రావడం దేనికి? మనకై మనం అలా చేసుకోలేకపోతున్నాం కాబట్టే మనకు ఆయన అవసరమవుతున్నారు. బాబా మనకు ఆ శక్తినిస్తారు, తమ చేతిని ఆసరాగా ఇచ్చి మనల్ని చివరివరకూ నడిపిస్తారు. మనం మన స్వంత ప్రయత్నంతో కోరికలను నెరవేర్చుకుంటే అవి మరిన్ని కోరికలకు దారి తీయవచ్చు లేదా కోరికలు మరింత బలంగా తయారుకావచ్చు. కానీ బాబా మన కోరికలను నెరవేరిస్తే ఆ అనుభవం వలన మన స్వభావం సరైన పంథాలో ప్రభావమయ్యేలా చేసి మనలో కావలసిన పరివర్తన తీసుకువస్తారు. అక్కడ ఆధ్యాత్మికతకు, ప్రాపంచికతకు మధ్య తేడా ఉండదు, సంఘర్షణ ఉండదు, తప్పు చేస్తున్నామనే భావన ఉండదు. "నాకు ఇంకా ప్రాపంచికమైన బంధాలున్నాయి, నేను అనర్హుణ్ణి, నేను పాపిని, నేను బాబా పాదాలు ఎలా పట్టుకోగలను?" అని అనుకోవడం లాంటివి ఏవీ ఉండవు.

సాధారణంగా అందరూ ఆధ్యాత్మికతంటే ప్రాపంచికమైన విషయాలను, కోరికలను వదలిపెట్టి ఆధ్యాత్మిక లక్ష్యాలని పిలవబడే ముక్తి, మోక్షం కోసమో, ఇటువంటి మరో దానికోసమో ప్రయత్నం చేయడమని అనుకుంటూ ఉంటారు. కానీ బాబా ఎప్పుడూ మనల్ని వీటన్నింటినీ వదలిపెట్టమని చెప్పలేదు. బాబా చెప్పేదిమనకు ఆకర్షణీయంగా, వేదాంతమార్గంగా, ఆధ్యాత్మికంగా అనిపించకపోవచ్చు. కొందరు బుద్ధిమంతులు, "అసలు ఇదేమి మార్గం?" అనవచ్చు. "ప్రాపంచికమైన విషయాల్ని వదలిపెట్టనవసరం లేదా? ఇదేమి ఆధ్యాత్మికత?" అని కూడా అనవచ్చు. ప్రపంచానికి భిన్నమైనదే ఆధ్యాత్మికత అని భావించే వారికి ఇది ఆధ్యాత్మికత కాదు (గురువుగారు నవ్వుతూ..) **ఆనందంగా ఆనందమనే గమ్యానికి చేర్చేదే బాబా పథం.** అంతేగానీ ఇది బాధతో కూడిన మార్గం కాదు. మనకు తీరని కోరికల వలన దుఃఖం కలుగుతుంది, కోరికలు తీర్చుకోవడం ద్వారా మనకు ఆనందం వస్తుంది. మన కోరికలు బాబా ద్వారా తీరుతున్నాయని మనకు అనుభవమయ్యేకొద్దీ, మన కోరికలు తీర్చేది బాబానే అని మనకు తెలిసేకొద్దీ మనం సహజంగానే బాబాను ప్రేమించడం మొదలుపెడతాం. అదేదో సాధన కాదు. సహజంగా, అప్రయత్నంగా, మన ప్రమేయం ఏమీ లేకుండా మనం ఆ ప్రేమ మార్గంలోకి లాగబడతాం. ఆ తరువాత ఏవైతే ఆధ్యాత్మికతకు ప్రతిబంధకాలుగా భావిస్తారో అవే మన ఆధ్యాత్మిక లక్ష్యమైన పరిపూర్ణానందానికి సోపానాలవుతాయి.

సాయి భక్తునికి అడ్డంకులంటూ ఏవీ ఉండవు. ఎటువంటి అడ్డంకులూ లేవు అనే ఎరుకే



మనకు ఎంతో భద్రతాభావాన్ని కలిగిస్తుంది. అలా కాకుండా మనం, "అయ్యో, మేము చాలా వదులుకోవాలి!" అనుకుంటే ఆధ్యాత్మికత ఒక రాక్షసిలా, బ్రహ్మరాక్షసిలా తయారవుతుంది. (గురువుగారు నవ్వుతూ..)

**భక్తుడు :** గురువుగారూ! భగవాన్ రమణమహర్షి ఒక్కసారి ఆ పారవశ్యస్థితిని, సాక్షాత్కారాన్ని పొందాక, ఆయన ఆ స్థితిలోనే స్థిరంగా ఉండిపోయారు. కానీ కొంతమంది ఆ స్థితిని పొందినా అందులో నిలకడగా ఉండలేకపోయారు. ఒక్కసారి ఆ స్థితిని పొందాక అందులోనే ఉండటానికి కావలిసింది ఏమిటి?

**గురువుగారు :** ఇతరులు ఏదో ఒక అనుభవాన్ని పొందవచ్చు. కానీ అది సరిగ్గా భగవాన్ పొందిన అనుభవం వంటిది అయిఉండకపోవచ్చు. వారికున్న ఇతర అవసరాలు బహిర్గతం కావడం వలన వాళ్ళు ఆ స్థితి నుండి బయటకు వస్తారు. భగవాన్‌కు ఇతర అవసరాలు ఏమీ లేవు కాబట్టి ఆయన ఆ స్థితిలోనే ఉండిపోయారు. ఒకవేళ ఎవరికైనా ఇతర అవసరాలు ఉంటే వాటిని తీర్చుకోక తప్పదు.

**భక్తుడు :** కాబట్టి ఆ అనుభవాన్ని పరిపూర్ణంగా స్వీకరించడానికి మనం సంసిద్ధంగా ఉండాలి?

**గురువుగారు :** జరిగేది అదే. ఇక్కడ, మనకు ఉన్న రకరకాల ఆకర్షణల మధ్య సామరస్యాన్ని సాధించి, వాటిని ఏకీకృతం చెయ్యడానికి ప్రయత్నిస్తున్నాం. మన ప్రేమను పెంచుకోవడం ద్వారా, మన అవగాహన పెంచుకోవడం ద్వారా, మన అవసరాలు, ఆశయాల పట్ల స్పష్టతను పెంచుకోవడం ద్వారా రకరకాల విషయాల పట్ల మనకు గల ఆకర్షణలను తగ్గించుకోవడానికి ప్రయత్నిస్తున్నాం. నెమ్మదిగా మనలోని ఈ ఆకర్షణలు పరిపూర్ణమైన ఆనందాన్ని పొందడం అనే ప్రధానమైన ఆకర్షణ చుట్టూ పొందికగా అమరిపోతాయి. కాలక్రమేణా ఈ విడి విడి ఆకర్షణలు వాటి శక్తి కోల్పోయి చివరికి 'మనం సంపూర్ణత్వం పొందాల'నే ఒకే ఒక్క శక్తివంతమైన ఆకర్షణ మిగిలిపోతుంది.

నా దగ్గర జరిగేది ఏమిటంటే, ఇక్కడకు వచ్చిన వాళ్ళు మామూలు మనుషులవుతారు (గురువుగారు నవ్వుతూ..) అంతేగానీ వాళ్ళు అసాధారణ వ్యక్తులుగానో, అసామాన్యులుగానో మారరు. మామూలు మనుషులుగా మారతారు (నవ్వులు). మనుషులలోని రకరకాల కోరికల మధ్య గల సంఘర్షణలు, తత్ఫలితమైన అస్పష్టత వలన మనుషులు అసహజంగా తయారవుతారు. మనకు నిజంగా అవసరం లేని కొన్ని కోరికలుంటాయి. అవి కేవలం ఏదో ఒక సంఘటనకి మన ప్రతిస్పందనలు మాత్రమే. ఉదాహరణకు మీకు ఎవరితోనైనా ఒక వాదన జరిగాక మీకు చెన్నైకి వెళ్ళాలనిపించి టాక్సీని పిలుస్తారు. మీకు నిజంగా చెన్నైకి పోవలసిన అవసరం లేదు, మీరు వెళ్ళిపోవడానికి ఆ వాదనను ఒక సాకుగా ఉపయోగించుకుంటారు. అది నిజమైన కోరిక, అవసరం




కాదు, కేవలం ఒక ప్రతిచర్య.

చాలా వరకు ఇటువంటి కోరికల ప్రతీకార చర్యలే. ప్రారంభంలో మన మనస్సు నిశ్చలమైన సరస్సులా ఉంటుంది. బాహ్య ప్రేరణలు, (వ్యక్తులతో) సంబంధాలు, రకరకాల ఇంద్రియ విషయాలు మొదలైనవి సహజంగా నిశ్చలంగా ఉండే నీటి (మనస్సు) లోనికి విసరబడిన రాళ్ళవంటివి. ఇవి అలలను సృష్టిస్తాయి. ఈ అలలే మన ఆలోచనలు. నిశ్చలమైన నీరు అలల రూపంలోకి మారడానికి కారణమైన శక్తే భావోద్వేగం. ఒక రాయి, రెండు రాళ్ళు, మూడు రాళ్ళు... ఇలా వందలకొద్దీ రాళ్ళు విసరబడుతుంటాయి. ఈ వందలకొద్దీ రాళ్ళు వేలకొద్దీ అలలను సృష్టిస్తాయి. ఈ అలలు ఒకదానితో ఒకటి ఢీకొని క్రొత్త అలలను సృష్టిస్తాయి. మనకు అనుభవమయ్యే ఒక్కోరాయి, ఒక్కో కోరిక అంతకుముందు విసరబడిన అన్ని రాళ్ళ శక్తితో నిండిఉంటుంది. “నాకు ఇంటికి వెళ్ళాలని ఉంది, నా కూతురిని చూడాలని ఉంది, నా కొడుకును చూడాలని ఉంది, నా భర్తను చూడాలని ఉంది, నాకు డబ్బు సంపాదించాలని ఉంది, ఇది కావాలి, అది కావాలి” అంటాము. కానీ ఒక్కో కోరికను తీసుకుంటే దాని వెనుక ఇతర కోరికలన్నింటి ప్రభావం ఉంటుంది. కాబట్టి, ఒక్కో కోరికను గుర్తించడం, వేరు చేయడం, స్పష్టతను తెచ్చుకోవడం చాలా కష్టసాధ్యమైన పని.

నేనేమంటానంటే బాబా అనే పెద్ద రాయిని ఈ కొలనులో (మనస్సులో) వేయండి – ఢాం – ఈ పెద్దరాయి అంతకు ముందున్న అలలను శాంతింపచేయదు. వాటిని కబళించివేస్తుంది. అంతకుముందున్న కోరికలు అలాగే ఉంటాయి. కానీ బాబా అనే పెద్ద కోరికతో కలసిపోతాయి. అవి మరో పెద్ద అలను సృష్టించి అంతిమంగా ఒడ్డును ఢీకొని, చిన్నగా తగ్గుతాయి. ఆ తరువాత ఆ అలలు ఉండవు. నా ప్రయత్నమంతా దీనికోసమే. బాబా అనే ఈ పెద్ద రాయిని వెయ్యడానికే నేను ప్రయత్నిస్తున్నాను. నేను రాయిని వెయ్యడానికి సిద్ధంగా ఉన్నాను కానీ మీరు చాలా జాగ్రత్తగా ఉన్నారు. మీరు దానిని పట్టుకొని వెనక్కి విసిరేస్తున్నారు (గురువుగారు నవ్వుతూ)


**భక్తుడు :** గురువుగారూ! ఇంతకుముందు రోజు పరిపూర్ణమైన ఆనందం కోసం మాకుండే కోరికను దూరం చేసే వివిధ ఆకర్షణల మీద సద్గురు సన్నిధి యొక్క ప్రభావాన్ని గురించి చెబుతూ తడి బట్టలను ఎండలో ఆరెయ్యడాన్ని ఉదాహరణగా చెప్పారు. మమ్మల్ని మేము ఆ దండెం మీద బాబా అనుగ్రహమనే ఎండలో (వెలుగులో) ఉంచుకుంటే చాలని చెప్పారు. అలా బాబా అనుగ్రహంలో (సూర్యుని వెలుగులో) ఉండటానికి ఏదైనా ఒక టెక్నిక్ (పద్ధతి) ఉందా?

**గురువుగారు :** నేను ఒక పద్ధతి చెబితే దాని వలన ప్రయోజనం ఉండదు. ఎందుకంటే మనలో ప్రతి




ఒక్కరికి ఒక్కోరకమైన కోరికలు, వాసనలు, ఆకర్షణలు ఉంటాయి. మన వ్యక్తిత్వం అంత సరళంగా (సింపుల్‌గా) ఉండదు. అది బహుముఖంగా ఉంటుంది. సాధారణంగా చాలామంది నామజపం చేస్తే ముక్తి వస్తుందనుకుంటారు. ఆత్మవిచారం చేస్తే మోక్షం వస్తుంది అనుకుంటారు, లేదా విపాసన ధ్యానం చేస్తేనో, మరో రకమైన ధ్యానం చేస్తేనో తమకు నిర్యాణం వస్తుందనుకుంటారు కానీ అది అలా ఉండదు. చాలామంది ఏదో ఒక్క పద్ధతిని అనుసరిస్తే తమకు ముక్తి వస్తుందని పొరపాటుపడుతుంటారు. సాధనా పద్ధతులు ఒక స్థాయి వరకే ఉపయోగపడతాయి, కొన్ని అవసరాలను మాత్రమే తీరుస్తాయి. కానీ మన వ్యక్తిత్వపు ప్రతి స్థాయిలోనూ మార్పు జరిగేలా ఏదో చేయాల్సి ఉంటుంది. చిట్టచివరకు జరిగేది ఏమిటంటే మనమేమీ చేయాల్సిన అవసరం లేదు, కేవలం అనుగ్రహం మాత్రమే ఆ పని చేయగలదు! అందులో ఏ మాత్రం సందేహం లేదు. మనం ఆ అనుగ్రహాన్ని స్వీకరించడానికి, అనుభవంలోనికి తెచ్చుకోవడానికి మనలోని కొన్ని అడ్డంకులను తొలగించుకోవాలి. ఈ అడ్డంకులను గుర్తించి, తొలగించుకోవడానికి మనం మన మనస్సును అర్థం చేసుకోవాలి. మనకు నిజంగా అడ్డుపడేది ఏమిటని చూసుకొని దాని గురించి ఆలోచించాలి. అలా అడ్డుపడేది మనలోని వాసనలు. ఉదాహరణకు, ఏకాగ్రతతో, ప్రశాంతంగా కూర్చోవడం అంత మంచి అనుభవాన్ని ఇస్తూ ఉంటే మీరు ఎందుకని పట్టుమని పదినిమిషాలు కూర్చోలేకపోతున్నారు? నా దగ్గర కూర్చుని మనస్సు లగ్నం చెయ్యలేకున్నారు. అది శారీరకమైన విషయం కావచ్చు, నిద్రరావడం కావచ్చు, మానసికమైన విషయాలు (వాసనలు) కావచ్చు. ఏదో మాట వారిలో హఠాత్తుగా ఒక ఆలోచననో, భావోద్వేగాన్నో రేకెత్తించవచ్చు. మనస్సు అంతకు ముందు చదివిన విషయం మీదకో, విన్న విషయం మీదకో పోవచ్చు. మనస్సు ఎక్కడికో పోవడం మూలంగా ఆ విషయం గురించే ఆలోచిస్తూ మీరు అయిదు నిమిషాలపాటు సత్సంగాన్ని కోల్పోయారు.

కాబట్టి మనం మనస్సు యొక్క తీరును గురించి తెలుసుకోవాలి. చాలా సందర్భాలలో మన మనస్సు అంత నిస్సహాయంగా, బలహీనంగా మారడానికి, పరిస్థితుల ప్రభావానికి లోనుకావడానికి కారణం మన అలవాట్లు. వీటినే వేదాంత పరిభాషలో "వాసనలు" అంటారు. మన మనస్సు దేనితో నిండి ఉంది, అది ఏమి చేస్తుంది అని ఆలోచించండి. మనకేదైనా సమస్య వచ్చినప్పుడు మనం దాని గురించే ఆలోచించడానికి ప్రయత్నిస్తాము. మనం ఆలోచిస్తున్నాం అని మనం అనుకుంటాం కానీ చాలాసార్లు మనం ఆలోచించడం లేదు. మనం ఆ సమస్యని పట్టుకొని కేవలం వ్రేలాడుతూ ఉంటాం. అంతకుముందు జరిగిన ఒక విషయాన్ని గురించి ఆలోచించడమో, రేపు ఏమి




జరుగబోతుందోనని ఊహించడమో చేస్తూ ఉంటాం. ఆలోచనలు అలల మాదిరిగా వస్తుంటాయి, రకరకాల ఆలోచనలు వస్తూ పోతూ ఉంటాయి. చాలా కొద్ది సందర్భాలలో మాత్రమే మనం మనస్సు పెట్టి ఆలోచిస్తాము. మనం తీసుకునే చాలా నిర్ణయాలు – అవి మంచివైనా, చెడ్డవైనా, ఒక పని చెయ్యడం గురించైనా, చెయ్యకపోవడం గురించైనా, ఏదైనా ఎంచుకోవడమైనా, ఎంచుకోకపోవడమైనా – ఇటువంటి నిర్ణయాలన్నీ మన భావోద్వేగాలమీద, ఇష్టాయిష్టాల మీద ఆధారపడి ఉంటాయి.

మన మనస్సు యొక్క వివిధ పార్శ్వాలను అర్ధంచేసుకుంటే మనం అలవాట్ల నుండి బయటపడి మనస్సును శుభ్రంగా ఉంచుకోవచ్చు. అప్పుడది మన లక్ష్యంపట్ల మనకు గల తదేక దృష్టికి అడ్డుపడకుండా, మనం మన బట్టలను బాబా అనుగ్రహమనే ఎండలోనుండి తీయకుండా చేస్తుంది. ఇటువంటి సందర్భంలో మనలోని అడ్డంకులను తొలగించుకోవడానికి రకరకాల సాధనలు, పద్ధతులు ఉపయోగపడతాయి. ధ్యానం, ఏకాగ్రత, సామూహిక కార్యక్రమాలు, నియమాలు మొదలైనవన్నీ కేవలం ఈ స్థాయి వరకే ఉపయోగపడతాయి. ఒక అలవాటు పోగొట్టుకోవడానికి ఉత్తమమైన మార్గం మరొక అలవాటును చేసుకోవడమే. ముల్లును తీయడానికి ముల్లునే వాడినట్లుగా, మీరు పెట్టుకున్న లక్ష్యం మీద మీకు మరింత ఏకాగ్రత కుదరడానికి ఏంచెయ్యాలో అనే విషయంలో మీకు స్వేచ్ఛ ఉంది. ఇటువంటివన్నీ మిమ్మల్ని మీరు ఆ సూర్యుని వెలుగులో ఉంచుకోవడం క్రిందకే వస్తాయి. మీ బట్టను దండెం మీద ఉంచుకోవడమంటే ఇదే. కానీ ఎప్పుడూ ఒక్క విషయం గుర్తుపెట్టుకోండి. బట్టను ఆరబెట్టేది మాత్రం సూర్యుడే, సద్గురువు యొక్క అనుగ్రహమే.

**గురువుగారు:** బాబా వంటి మహాత్ములను సద్గురువుగా పొందే భాగ్యం లభించాక మనం మరే ఇతర సాధనల గురించి ఆలోచించాల్సిన పనిలేదు. **ఏమి ఇవ్వాలో, ఎప్పుడు ఇవ్వాలో, ఎలా ఇవ్వాలో బాబాకు తెలుసు.** వంద సంవత్సరాలపాటు మంత్రతంత్ర సాధనలు చేసినా సాధించలేని దానిని బాబా ఒక్కక్షణంలో ఇవ్వగలరు. ఒక్కక్షణంలో ఆయన మనలోని ఏదైనా వాసనను, చెడు సంస్కారాన్ని క్షయం చెయ్యగలరు. నేను మిమ్మల్ని ఏమీ చెయ్యమని చెప్పడం లేదు. నేను మీకు కొన్ని చిట్కాలను మాత్రం చెబుతున్నాను. బాబా ఇచ్చే ఆనందాన్ని అనుభవంలోకి రానీయకుండా చేసేది మీ వాసనలే. అవి లేకుండా పోయినప్పుడు మీరు ఆనందాన్ని మరింతగా అనుభవంలోకి తెచ్చుకోగలుగుతారు. ఇప్పుడు ఈ క్షణంలో కూడా మీరు ఆనందాన్ని పొందుతున్నారు. కానీ చాలామందికి ఆ విషయం తెలియదు. అందువలన ఆ ఆనందాన్ని, థ్రిల్‌ను కోల్పోతున్నారు. నేను అడ్డంకులను, ఇబ్బందులను తొలగించుకోమని ఎప్పుడు చెప్పినా నా ఉద్దేశ్యం మీ దగ్గర ఉన్నదానిని మీ ఎరుకలోనికి తీసుకువచ్చే




ప్రయత్నమే. నేను మీ పాస్‌బుక్‌ను మీకు చూపించి, మీ అకౌంట్‌లో ఎంత ఉందో మీకు చూపిస్తున్నాను (గురువుగారు నవ్వుతూ..) మీ అకౌంట్‌లో పెద్ద మొత్తం డిపాజిట్ చేసివున్న విషయం తెలియక మిమ్మల్ని మీరు పేదవారని, ఆకలితో అలమటిస్తున్నారని అనుకుంటున్నారు. మీ పాస్‌బుక్ చూడండి. మీ అకౌంట్‌లో ఎంత మొత్తం ఉందో తెలుస్తుంది.

## పని-ప్రేమకు ఓ చక్కని వ్యక్తీకరణ *మే 2015*

**భక్తుడు :** గురువుగారూ! బాబా చరిత్రలో బాబా ఎప్పుడైనా ఎవ్వరికైనా ధ్యానం చేసుకోమని సూచించారా?




**గురువుగారు :** "ధ్యానం చేయి, సద్గ్రంథాలు చదువు, పని చెయ్యి" అని మాత్రమే బాబా చెప్పారు. పనిచెయ్యి, భగవంతుని స్మరించు, మంచి గ్రంథాలు చదువు – ఇదీ బాబా చెప్పిన అసలు క్రమం. ఆయన ఈ మూడింటిని చెప్పారు.

**భక్తుడు :** బాబా ఈ మూడింటిని ఒక ఖచ్చితమైన క్రమంలో చెప్పారంటున్నారా, గురువుగారూ?

**గురువుగారు :** అవును, పనిచెయ్యడం మొదటిది. అందుకనే నేను ఆ క్రమాన్ని గురించి ప్రత్యేకంగా చెప్పాను.

**భక్తుడు :** బాబా పనిచెయ్యడాన్ని మొదటగా ఎందుకు చెప్పారు?

**గురువుగారు :** ఎందుకంటే నిరంతరం బాబాను స్మరించడం, ఆయనను ధ్యానించడం సామాన్య జనానికి సాధ్యం కాదు. ఆ మాటకొస్తే మంచి పుస్తకాలు చదవడం కూడా అంతే. (గురువుగారు నవ్వుతూ...) ఎందుకనో చాలామంది పనిచెయ్యడాన్ని ఒక శాపంగా భావిస్తారు. దేవుడు (తాము సృష్టించిన  తొలి మానవులైన) ఆడమ్ మరియు ఈవ్‌లకు పనిని ఒక దండనగా విధించినట్లు, అందువలన వాళ్ళు చెమటోడ్చి తమ ఆహారాన్ని సంపాదించుకోవలసి వచ్చిందని బైబిల్‌లో ఉంది. కానీ నేను మాత్రం పని ఒక వరంగా భావిస్తాను. మనం కష్టపడి సంపాదించుకున్నది అది ఎండిపోయిన రొట్టె అయినా సరే దాని మాధుర్యం దానికుంటుంది, దానిని తినడంలో ఒక సంతృప్తి ఉంటుంది. అందుకనే పనిచెయ్యడానికి నేను తొలి ప్రాధాన్యతనిస్తాను. మనం పనిచేసి సంపాదించుకోవాలి. అలా కాకపోతే, మీరు భవిష్యత్తుకోసం అట్టిపెట్టుకున్న ధనమో లేక పెన్షనో ఉంటే మీరు దానితో జీవించవచ్చు. అలా అయితే సమస్య లేదు. నేను  నా పెన్షన్‌తో, నా స్వంత సంపాదనతో జీవిస్తున్నాను.




కానీ మొదటగా పనిచెయ్యడానికే నేను ప్రాముఖ్యతనిస్తాను. బద్ధకంగా ఉంటూ మీ కాలాన్ని వ్యర్థంగా గడిపేయవద్దు.

**భక్తుడు :** భగవద్గీత అందించిన గొప్ప సిద్ధాంతాలలో నిష్కామకర్మ ఒకటని చెప్తారు. నిష్కామకర్మ అంటే ఏమిటి? కర్మయోగం అంటే అదేనా గురువుగారూ?

**గురువుగారు :** నేను నా చుట్టూ ఉండే వాళ్ళకు దేనినైతే అనుభవంలోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నానో అదే కర్మయోగం. ఉదాహరణకు కొందరు వ్రాయాలనుకుంటారు. అది ప్రచురిస్తామని నేను ఎప్పుడూ వారికి హామీ ఇవ్వను. (గురువుగారు నవ్వుతూ...) కేవలం వాళ్ళు వారి ప్రేమకు వ్యక్తీకరణగానే వ్రాస్తారు. మీకు నచ్చింది చెయ్యండి, కానీ అది ప్రేమకు వ్యక్తీకరణగానే చెయ్యండి అంటాను నేను. చాలామంది ఇక్కడకు వచ్చి ఎన్నో పనులు చేస్తారు – పాలు పంచుకోవడం అంటారు కదా అలా. కానీ వాళ్ళను ప్రత్యేకంగా గుర్తించడం జరగదు. వాళ్ళు సహజంగానే ఏ కోరికా లేకుండా పనిచెయ్యడం అనే పద్ధతికి అలవాటు పడతారు. కనీసం ఎవరైనా తమను గుర్తించాలన్న కోరిక కూడా ఉండదు. వాళ్ళు చేసే పని కేవలం వారి ప్రేమకు వ్యక్తీకరణ మాత్రమే. అంతే. కనీసం నాతో అయినా మంచిగా ఒక మాట అనిపించుకోవాలన్న కోరిక కూడా ఉండదు. ఒకవేళ వారికి అటువంటి కోరిక ఉంటే అది సకామకర్మ అవుతుంది. అందుకనే ఎవరన్నా తాము చేసిన పనిని గురించి ప్రత్యేకంగా చెప్పాలని చూస్తున్నప్పుడు నేను వారిని తక్షణం వారిస్తాను. నేను ఇలా చేయడానికి కారణం వారిని తక్కువ చెయ్యడానికి కాదు. తమను 'గుర్తించాలి' అన్న కోరికే అహంకారానికి బీజం. నా దగ్గరున్న వారు ఏమి చేసినా అది వారి ప్రేమకు వ్యక్తీకరణ కావాలి. అంతకుమించి వేరే ఏ కారణంగానూ ఉండకూడదు. అప్పుడు ఆ ప్రేమ స్వచ్ఛంగా వ్యక్తమవుతుంది.

ఒకవేళ మీరు నిజంగా ఏమన్నా చెయ్యాలనుకుంటే మీ ప్రతిభాపాటవాలను బాబాకు అర్పించండి. అది మీ మనస్సుకు ఎంతో తృప్తినిస్తుంది. ఇలా నివేదన చేస్తున్నంతవరకు మీరు ప్రేమతో బాబాను గుర్తుపెట్టుకుంటారు. అందులో కొంచెం కూడా వాణిజ్యధోరణిగానీ,వ్యాపార దృక్పథం గానీ, స్వార్థపరత్వంగానీ ఉండవు. ఇంతకు మించిన నిష్కామకర్మయోగం ఏముంటుంది? కొందరు చక్కగా వ్రాస్తారు, అది వారి ప్రతిభ. కొంతమంది చక్కగా వండుతారు, అది వారి ప్రతిభ. కొంతమంది బాగా శుభ్రం చేస్తారు, అది వారి ప్రతిభ. మీ ప్రతిభా పాటవాలు బాబా మీకు ఇచ్చిన బహుమానం. మీరు దానిని బాబాకు సమర్పించడం ద్వారా అది ఆయనను గుర్తుపెట్టుకోవడానికి ఒక మార్గమవుతుంది. అందులో బాబాను అనుభవంలోనికి తెచ్చుకోవడం, అదే సమయంలో దానిని వ్యక్తం చేయడం కూడా ఉంటుంది. ఇటువంటి పని అణుమాత్రం చేసినా సరే అది మీకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ఆధ్యాత్మికత పేరుతో దానినేదో వ్యాపారంగానో, ఒక వృత్తిగానో చేసి నేను దానిని చెడగొట్టి పనికిరాకుండా చేయాలనుకోవడం లేదు. దానివల్ల మీకు ఎటువంటి మనశ్శాంతి





ఉండదు.


మన జీవితమంతా (సద్గురువుపట్ల గల) ప్రేమను వ్యక్తీకరించడంలో భాగం అయినపుడు ఇక ప్రతిదీ నిష్కామమే అవుతుంది. సాధారణంగా అందరూ భగవద్గీతలో చెప్పిన నిష్కామకర్మంటే ఏ కోరికా లేకుండా చేసే పని అని అనుకుంటూ ఉంటారు. నిజానికి నిష్కామకర్మంటే ఎటువంటి ఫలాపేక్ష లేకుండా చేసే పని. ఫలితం గురించి ఆలోచించకుండా, ఆందోళనపడకుండా చేసే పని. ఒక పనిని ఆ పనిపట్లగానీ లేదా ఫలితంపట్లగానీ ఏ కోరికా లేకుండా చేయడం ఎలా సాధ్యమవుతుంది? సాధారణంగా అది సాధ్యం కాదు, దాని గురించి వేరే ఆలోచన అక్కరలేదు. ఎప్పుడైతే మనం చేసే పని మన ప్రేమకు వ్యక్తీకరణ అవుతుందో అప్పుడు మాత్రమే అది సాధ్యమవుతుంది. అదీ నిష్కామకర్మ అంటే.

ఇక్కడ మనం చేసేది ఏదైనా సరే, అది బాబాతో మనల్ని మనం అనుసంధానం చేసుకోవడానికి ఒక మార్గం. కాబట్టే మనం ఆ పని చేస్తాం. మనం అలా చెయ్యడాన్ని ఇష్టపడతాం. మార్గమూ అదే, గమ్యమూ అదే. అది ఏదో ఫలితాన్ని పొందడానికి ఒక సాధన కాదు. మీరు ఎంచుకున్న మార్గమే మీకు ఫలితాన్నిస్తుంది. అదే నిష్కామకర్మయోగమంటే. అప్పుడు మీరు చేసే ఏ పనైనా కర్మయోగమే అవుతుంది. వ్రాస్తున్నా, పాత్రలు శుభ్రం చేస్తున్నా, నేలను ఊడుస్తున్నా – అది యోగమే అవుతుంది. నేను నాకున్న పరిమితులలో మీరందరూ అటువంటి నిష్కామకర్మ చేసేలా చేస్తున్నాను. దానిని కర్మయోగం అంటారని నేను మీకు చెప్పలేదు. ఎందుకంటే నేను ఆ విషయం చెబితే మీరు ఆ ఉత్సుకతను కోల్పోతారు. పని చేస్తున్నవారికి ఈ విషయాలన్నీ తెలియకుండానే వారు ఆ పని చెయ్యాలని నేను కోరుకుంటాను, వారికి తెలియకుండా దెబ్బతీయాలనే నా ప్రయత్నం (గురువుగారు నవ్వుతూ..)

**భక్తుడు :** గురువుగారూ! నేను సేవ చేయాలనుకున్నప్పుడు ఎలాంటి పనిని ఎంచుకోవాలో తెలుసుకోవడం ఎలా?

**గురువుగారు :** నేను ముందు చెప్పినట్లు, మీరు చేసే పని మీ ప్రేమకు వ్యక్తీకరణ కావాలి. మనం ప్రేమను వ్యక్తపరిచేందుకు ఒక పనిని ఎంచుకునేటప్పుడు అవి మన శక్తి సామర్థ్యాలకు అనుగుణంగా ఉండాలి, అంతేగానీ, మన ఇష్టాయిష్టాలను అనుసరించి ఉండకూడదు. మన అహంకారానికి దెబ్బ తగిలే అవకాశం ఉన్న పనుల నుండి మనం తప్పించుకోకూడదు.

అలా తప్పించుకుని అది కూడా ప్రేమకు వ్యక్తీకరణే అని సమర్థించుకోకూడదు. కాబట్టి ఈ వ్యక్తీకరణల మధ్య తేడాలుంటాయి. ఒకవేళ మనం జాగ్రత్త వహించవలసి వస్తే మనం ఒక పనిని (వ్యక్తీకరణకు) బదులు మరొక పనిని (వ్యక్తీకరణను) ఎందుకు ఎంచుకున్నాం అనే విషయంలో జాగ్రత్త వహించాలి.




అక్కడ మనం జాగరూకతతో ఉండాలి. ఉదాహరణకు, అక్కడ చాలా అధికార దర్పంతో ప్రవర్తించే వ్యక్తి ఉన్నాడు, ఆయనతో పని చేయాల్సి వస్తుందని మీరు కొన్ని పనులను ఎంచుకోకపోవచ్చు. లేదూ, నేను చాలా మేధావిని కాబట్టి వంటపని చెయ్యను అని మీరు అనుకోవచ్చు (గురువుగారు నవ్వుతూ..) పనిని ఎంచుకోవలసి వచ్చినప్పుడు మీరు ఇలాంటి విషయాలలో చాలా జాగ్రత్తగా ఉండాలి.

ఇటువంటి వ్యక్తీకరణల వెనుకగల ప్రాథమికమైన సూత్రాన్ని మాత్రం ఎవ్వరూ మర్చిపోకూడదు, లేకపోతే వాటి వలన ప్రయోజనం ఉండదు. ఒక పని (వ్యక్తీకరణ) మన అహంకారాన్ని పెంచుతుందా, పోగొడుతుందా అనే విషయంలో మనం జాగ్రత్తగా ఉండాలి. ఇది చాలా సూక్ష్మంగా, తికమకపెట్టేలా ఉంటుంది. అది ఎటువంటి వ్యక్తీకరణ అయినా అది మిమ్మల్ని మృదువుగా చేసేలా ఉండాలి. ప్రేమ యొక్క ప్రధానమైన ఉద్దేశ్యం అహంకారం లేకుండా చెయ్యడమే – అక్కడ మిమ్మల్ని మీరు కోల్పోవాలి.

కాబట్టి మీరు ఒక్క విషయం గుర్తుపెట్టుకుంటే చాలు. మనం చేసే ఏ పనిలోనైనా – అది శారీరకమైనది కావచ్చు. మేథస్సు సంబంధించినది కావచ్చు – మనం మన అహంకారాన్ని కొంత కోల్పోవాలి. మీరు ఆ పని పూర్తి చేసిన తరువాత మీకు మీరు తేలికగా అనిపించాలి. మళ్ళీ ఆ పని చేస్తే ఇంకొన్ని గ్రాములు (అహంకారం) పోగొట్టుకోవాలి. మీరు మళ్ళీ చేస్తారు మళ్ళీ ఇంకొన్ని గ్రాములు (అహం) పోగొట్టుకుంటారు. మీరు ఎంతగా అహంకారాన్ని కోల్పోతారో అంతగా ప్రయోజనం పొందుతారు.

**భక్తుడు :** గురువుగారూ! మా ఇష్టాయిష్టాలను అధిగమించడం ఎలా?

**గురువుగారు :** మీరు ఇష్టపడే విషయాలన్నింటికన్నా బాబాను ఎక్కువగా ఇష్టపడితే ఆ ఇష్టంలో మిగతా ఇష్టాలన్నీ లేకుండా పోతాయి. అలాగని మీకు ఇష్టాయిష్టాలే ఉండవని కాదు. అవి ఉంటాయి. మీరు వాటిని లేకుండా చేసుకోవాలనుకుంటే అది మిమ్మల్ని మీరు లేకుండా చేసుకోవడానికి చేసే ప్రయత్నంలా ఉంటుంది. మీరంటూ లేకుండా పోవడం మీకు ఎలాగూ ఇష్టం ఉండదు కాబట్టి మీరు ఆ ప్రయత్నాన్ని ప్రతిఘటిస్తారు. నిజానికి మీరు మీ ఇష్టాయిష్టాలను తుడిచివేయలేరు. ఎందుకంటే అది మీరు కూర్చొని ఉన్న కొమ్మను మీరే నరుక్కోవడం లాంటిది. లేదా కంప్యూటర్ పరిభాషలో చెప్పాలంటే ఆపరేటింగ్ సిస్టమ్ ఉన్న భాగంలోనే ఉండి ఆపరేటింగ్ సిస్టమ్‌నే తొలగించడానికి ప్రయత్నం చేయడంలా ఉంటుంది. అది మీవల్ల కాదు. ఎందుకంటే ఆ వ్యవస్థని తొలగించాలని చూసేది కూడా ఆ వ్యవస్థలో భాగమే కాబట్టి దానిని అదే తొలగించుకోలేదు (గురువుగారు నవ్వుతూ...)

**భక్తుడు :** కాబట్టి ఇష్టాయిష్టాలు తలెత్తినపుడు మనం బాబాను గుర్తుచేసుకోవాలా గురువుగారూ? మీరు చెబుతున్నది ఇదే కదా?

**గురువుగారు :** నా ఉద్దేశ్యం కేవలం బాబాను గుర్తుచేసుకోమని మాత్రమే కాదు. బాబాకు ఏమి



ఇష్టమో, ఏది మిమ్మల్ని బాబాకు దగ్గర చేస్తుందో ఆలోచించడానికి ప్రయత్నించండి. అది మీకిష్టమైనా కాకపోయినా, అది బాబాకు సంబంధించినది కాబట్టి, మీరు దానిని ఇష్టపడటం మొదలుపెడతారు. దానిని ఇష్టపడటానికి ప్రయత్నించండి. ఆ ప్రయత్నం అది బాబాకు సంబంధించినది అనే విషయాన్ని గుర్తు చేస్తుంది. బాబాతో దానికి గల సంబంధాన్ని గుర్తుపెట్టుకోవడం వల్ల మీరు దానిని ఇష్టపడతారు.

**భక్తుడు :** గురువుగారూ! ఏదైనా పనిలో నిమగ్నమయితే ఎప్పుడూ మన గురించే మనం ఆలోచించుకోవడం తగ్గుతుందని మనల్ని మనం మరచిపోగలమని అదే ఆ పని యొక్క ప్రయోజనమని మీరు చెప్పారు. ఇది కేవలం ఆ పని చేస్తున్నంతవరకే ఉంటుందా లేక ఈ ప్రభావం తరువాత కూడా ఉంటుందా?

**గురువుగారు :** ఖచ్చితంగా తర్వాత కూడా ఉంటుంది. మీరు ఆ పనిచేస్తున్నంత వరకు మీ వాసనలు విచ్ఛిన్నమవుతూ ఉంటాయి. అది కేవలం ఆ పని చేస్తున్నంతవరకే కాదు, ఆ తరువాత కూడా కొనసాగుతుంది. ఎప్పుడూ మన గురించే ఆలోచిస్తూ ఉండటం, మనమే అన్నింటికీ కేంద్రంగా ఉండాలనుకోవడం, ఎప్పుడూ మన స్వంత కథల గురించే మాట్లాడుతూ, ఆలోచిస్తూ ఉండటం – ఇలాంటి అలవాట్లు బలహీనపడతాయి. మనం చేసే పని అనే కథ మన ఇతర కథలను ముక్కలు చేస్తుంది.

**గురువుగారు :** మనం సమస్తాన్ని పరిత్యజించడానికి సిద్ధంగా లేనంతవరకు మనకు ఏదైనా పని అవసరం. ఈ పని మనం ప్రేమించే లక్ష్యం వైపుగా మరలనివ్వండి. ఆధ్యాత్మికమూ, ప్రాపంచికమూ రెండూ నెరవేరాలి.

నేను కర్మయోగాన్నో, నిష్కామకర్మనో లేదా పనినో ధ్యానంకన్నా గొప్పదని చెప్పడంలేదు. ఎటువంటి ప్రయత్నం లేకుండా అలా కూర్చొని 24 గంటలూ ధ్యానస్థం కాగలిగితే – దానికే నా తొలి ప్రాధాన్యత. కానీ మీరు అలా లోతుగా ధ్యానస్థులు కాలేకపోతే మనస్సుని వేరే పనిలో నిమగ్నం చేయండి. ధ్యానం పేరుతో కూర్చొని రకరకాల విషయాల గురించి ఆలోచిస్తూ దానిని పాడుచేసుకోకండి. లేకపోతే మనస్సు దెయ్యాల నివాసంగా మారుతుంది. ఏ వ్యాపకమూ లేని బుర్ర దెయ్యాల నివాసం అంటారు కదా. ఇంకా మనస్సు అంత లోతుల్లోకి ఎందుకు వెళ్ళలేకపోతోంది? మనలోని ఏవో అవసరాలు, ప్రేరణలు, వాసనలు మొదలైన వాటిని పదిమందితో అన్యోన్యంగా ఉండటం ద్వారా, పనిచేయడం ద్వారా పోగొట్టుకోవాల్సి ఉంది. కాబట్టి వాటిని అలాగే పోనివ్వండి. ఆ తరువాత తిరిగి ధ్యానం మొదలు పెట్టవచ్చు. మీరు చేసే పని సేవే కావాల్సిన అవసరం లేదు. మీరు చెయ్యగలిగినంత మేరకు ఏదైనా పని చెయ్యండి.

**శిష్యునికి ఉండవలసిన ముఖ్యమైన లక్షణాలు ఓర్పు, ఓపిక, నమ్మకం, పట్టుదల, అచంచల భక్తి.**




**భక్తుడు:** కానీ సాధారణ జీవితంలో – అంటే సద్గురువుకుగానీ, ఉన్నతమైన లక్ష్యానికిగానీ సంబంధంలేని – పని చేస్తున్నప్పుడు దానివల్ల మనలోని చెడు వాసనలు (చిత్తవృత్తులు) తగ్గకపోగా వాటిల్లో మనం మరింతగా మునిగిపోవచ్చు కదా! మరి ఇతర పనులకు, గురువుకు సంబంధించిన పనులకూ మధ్య గల తేడా ఏమిటి?

**గురువుగారు:** గురువు యొక్క అనుగ్రహం.

**భక్తుడు:** సద్గురువు ఎంపిక చేసిన పనులను మనం చేస్తున్నప్పుడు మనం మనలోని చెడు సంస్కారాల నుండి త్వరగా బయటపడతామా?

**గురువుగారు:** లేదు లేదు. అది గురువు ఎంపికకు సంబంధించిన అంశం కాదు. మీకు ఇష్టం లేకపోయినా సరే మీరు గురువుకు నచ్చిన పనులు చెయ్యడం గురించిన అంశం. మనకు ఇష్టమైన పనులే చేస్తే మనలోని సంక్లిష్టతలు మరింత బలంగా తయారవుతాయి. కానీ వ్యక్తిగతంగా మనకు ఇష్టం లేకపోయినా గురువుకు ఇష్టమైన వాటిని చెయ్యడం మొదలుపెడితే ఇక మనలోని వాసనలు బలంగా తయారవ్వడమనే ప్రశ్నకు తావెక్కడిది?

**భక్తుడు:** సాయిపథంలో పని పట్ల ఉండే దృక్పథమంతా చాలా విభిన్నంగా ఉంది. ఏదైనా పని పూర్తి చేయడానికి సహాయపడటంకంటే అందరూ పనిచేయడానికి గల అవకాశాల కోసం ఎదురు చూస్తారు. ఇటువంటి అనుభవం తొలిసారి నాకు ఎదురైన సందర్భం నాకు ఇంకా గుర్తు ఉంది. నేను చిమ్ముతున్నప్పుడు ఒక గురుబంధువు నా వద్దకు వచ్చి, “చిమ్మే అవకాశాన్ని నాకివ్వండి, మీకు ఇంకా వేరే పనులు చేయడానికి చాలా అవకాశాలున్నాయి” అన్నాడు.

**గురువుగారు:** అవును. ఇది విభిన్నమైన దృక్పథం. ఇక్కడ ఏదైనా పని చేసేవారు తమకు తాము సాయం చేసుకోవడానికి అవకాశాలు వెతుక్కుంటారు. అంతేగానీ, వాళ్ళు ఇతరులకు సాయం చేస్తున్నామని అనుకోరు. మీరు వేరే వాళ్ళకు సాయం చేస్తున్నాం అని అనుకుంటున్నంతవరకు మీరు ఏవీ పొందలేరు.

**భక్తుడు:** గురువుగారూ! మీకు దగ్గరగా ఉండి పనులు చేసేవారు ఎక్కువగా మీ సాంగత్యంలో ఉంటూ ఎక్కువ అనుగ్రహాన్ని పొందుతున్నట్లుగా అనిపిస్తోంది.

**గురువుగారు:** వాళ్ళకు అనుగ్రహాన్ని ఇచ్చేది వాళ్ళు చేసే పని కాదు. నాతో అనుబంధం ఉండాలి అనుకునే వాళ్ళ కోరికే వాళ్ళకు ఆ అనుగ్రహాన్ని ఇస్తుంది. నిజానికి దగ్గరగా ఉండాలి అనే కోరిక కలిగిఉండటమే అనుగ్రహం. అంతేగానీ ఎవరైనా ఇక్కడ ఉంటే వారికి నేను ఎక్కువగా అనుగ్రహాన్ని ఇస్తానని కాదు. వాళ్ళు ఎక్కువగా స్వీకరించగలుగుతున్నారు. మీరు నిజంగా ఇంకా ఎక్కువ అనుగ్రహం కోసం తపిస్తూ ఉంటే మీరు దానిని పొందుతారు.

**ఇతరుల తాపాలను తీర్చడం కోసం, ఉద్ధరించడం కోసం తమ జీవిత సర్వస్వాన్ని త్యాగం చేసేవారు పరమగురువులు.**




**భక్తుడు :** అవును గురువుగారూ! అది నా అనుభవం కూడా. మీతో ఉండటం వలన అనుగ్రహం వస్తుందని కాదు. మీతో ఉండటమే అనుగ్రహం.


**గురువుగారు :** ఎవరైనా నాకు దగ్గరగా ఉంటే ఎక్కువ అనుగ్రహాన్ని పొందుతారని నేను చెప్పడంలేదు. వాళ్ళ దృష్టిలో వాళ్ళు నాతో ఉండటమే అనుగ్రహం. అది వాళ్ళ భావన, అది వాళ్ళ అనుభవం. అందుకనే వాళ్ళు ఇక్కడ ఉన్నారు. అంతేగానీ ఏదో నమ్మకంతోనో, ఏదో ఆశతోనో లేక ఏదో సిద్ధాంతరీత్యానో లేకపోతే శాస్త్రాలలో చెప్పబడిందనో కాదు. అది వాళ్ళ అనుభవం కాబట్టి వాళ్ళు ఉంటున్నారు.

**గురువుగారు :** మనం చేసే పని మనల్ని ప్రభావితం చేస్తుంది. మనం చేసే పనివల్ల ప్రభావితం కావడం మన స్వాభావిక ధర్మం. కాబట్టి సత్సంగంతో, బాబాతో లేదా మీరు ప్రేమించే ఏ విషయానికి సంబంధించిన పనులలోనైనా సరే పాలు పంచుకోండి. మీరు చేస్తున్న ఆ పని ముఖ్యం కాదు. కేవలం పనిచేయడమే ముఖ్యం. ఆ పని చెయ్యడమే ముఖ్యమైన అంశం. మనకు అదే కర్మయోగం. ఒక్కొక్కరికీ ఒక్కొక్క రకమైన ప్రతిభాపాటవాలు ఉంటాయి. మీకున్న పరిమితి సమయంలో మీకు సాధ్యమైనంతవరకు, మీ సామర్థ్యం మేరకు వాటిని వ్యక్తం చేస్తూ, వాటిని మీ జీవితంలో భాగం చేసుకోండి. అప్పుడు మీరెంత ఆనందంగా ఉంటారో చూడండి.

నేను ఎప్పుడూ బాబా గురించే ఆలోచిస్తుంటాను. నేను ఎప్పుడూ గురువుగారి గురించే ఆలోచిస్తుంటాను అని మీరు అనుకోవచ్చు. మీరు ఒకవేళ నిజంగా బాబా గురించే ఆలోచిస్తుంటే అది మీ స్వభావంలో, మీరు చేసే పనులలో వ్యక్తం కావాలి. ఇక్కడి నుండి వెళ్ళాక అంతా తారుమారైపోతుందని చెప్తారు. నేను దానిని నమ్మను. మీకు నిజంగా అంత అవసరం ఉంటే, నిజాయితీ, తపన ఉంటే మీరు ఎక్కడున్నా కనెక్ట్ (అనుసంధానం) కాగలరు. మీకు ఆ అవసరం లేకపోతే మీరు ఇక్కడున్నా కనెక్ట్ కాలేరు.

మీరు ఆఫీసు నుండి వచ్చాక మీకున్న నైపుణ్యాన్ని, అభిరుచిని బట్టి మీరు ప్రేమించే లక్ష్యానికి సంబంధించిన ఏదో ఒక పని చెయ్యవచ్చు. ఉదాహరణకు కొంతమంది కలసి ఈ -మెయిల్ సర్వర్ ఏర్పాటు చేసారు. దీనివల్ల సాయిభక్తులు ఒకరితో ఒకరు సమాచారాన్ని పంచుకోవచ్చు. వాళ్ళకు ఆ విషయంలో పరిజ్ఞానం ఉంది. కావలసిన నైపుణ్యం ఉంది. ఇదేవిధంగా మీరు ఏదో ఒక పనిని ఎంచుకోవచ్చు. దానివల్ల మీరు బాబాతో అనుబంధంలో ఉండటమే కాకుండా అది మిగతావారికి కూడా ప్రయోజనకరంగా ఉంటుంది.

కాబట్టి ఊరికే బాబాతో మీకు గల అస్పష్టమైన సంబంధం గురించి మాట్లాడవద్దు. “నా మనస్సు ఎప్పుడూ బాబా మీదే ఉంటుంది. బాబా గురించి ఆలోచించకుండా ఒక్క క్షణం కూడా గడవదు” (గురువుగారు నవ్వుతూ) ఇలా చాలామంది అంటారు. కానీ 99 శాతం మంది విషయంలో




అది సాధ్యపడుతుందని నేను అనుకోను. మరే ఇతర ఆలోచనలు, ఆకర్షణలు లేని రమణమహర్షి వంటి వారికి అది సాధ్యపడుతుంది. వాళ్ళు ఏం చేసినా ఏం చేయకపోయినా వారు ఎప్పుడూ తమ ఆరాధ్య వస్తువుతో ఒక్కటై ఉంటారు. రమణమహర్షికి అరుణాచలాన్ని గురించి ఆలోచించకుండా ఒక్క క్షణం కూడా గడిచేది కాదు.

మనం చాలా విషయాలను చూస్తాం, చాలా విషయాలు వింటాం. వాటి గురించి ఆలోచిస్తాం. వాటివల్ల రకరకాల ప్రభావాలకు లోనవుతాం. మన మనస్సులను ఈ ప్రభావాల నుండి రక్షించి సద్గురువుతో కనెక్ట్ (అనుసంధానం) కావడానికి మనకు ఏదైనా పని అవసరం. దాని విలువ అంతవరకే. నేను దానిని నిష్కామకర్మ అనను. సద్గురువుతో కనెక్ట్ కావడానికి మనకు గల అవసరమది. అది మన ప్రేమకు, అవసరానికి, తపనకు వ్యక్తీకరణ.

**గురువుగారు :** మీ మార్గంలో ప్రతిదీ చివరకు ఆఫీసుకు పోవడం కూడా మీ యోగంలో భాగం కావాలి. ఎవరి మెప్పో పొందాలని, ఎవరో సర్టిఫికేట్ ఇవ్వాలని కాకుండా మీ పనిని మీరు మీకు సాధ్యమైనంత మేరకు ఉత్తమంగా చెయ్యండి.

**భక్తుడు:** కానీ చాలా సందర్భాలలో నేను అత్యుత్తమం అనుకున్నది సర్వోత్తమమైనది కాదని అనిపిస్తుంది.

**గురువుగారు :** అలా కావలసిన అవసరం లేదు. మీరు గొప్పగా చేస్తున్నారా లేదా అనేది ముఖ్యం కాదు. మీరు ఎలా (ఏ దృక్పథంతో) చేస్తున్నారనేది ముఖ్యం. ఏదో సాధించాలనే ఆలోచన వచ్చిన తక్షణం అది మీ సామర్థ్యాన్ని నాశనం చేస్తుంది. మీరు చేసే పనిని ఆనందించడం మానేస్తారు. "నేను దీనిని అత్యుత్తమంగా చేస్తున్నానా? నేను ఏవైనా తప్పులు చేస్తానేమో, దీని గురించి నలుగురూ ఏమనుకుంటారో?" అని ఆలోచిస్తూ ఆ పనిచేయడంలోని నేర్పును (ఆర్ట్‌ను) కోల్పోతారు. మీరు దాని గురించి ఎంత ఎక్కువగా ఆలోచిస్తే అన్ని ఎక్కువ తప్పులు చేస్తారు.

మనందరికీ అనుభవంలో ఉన్న ఒక ఉదాహరణను ఇస్తాను. మీరు మీ దేశానికి వెళ్ళి స్నేహితులను కలసినపుడు చాలా సునాయాసంగా ఇక్కడి విషయాల గురించి ఉపన్యాసాలు ఇస్తారు. ఒక స్నేహితుడు మిమ్మల్ని గురూజీ ఏం చెప్పారు అని అడిగితే మీరు అద్భుతంగా వివరిస్తారు. మీరు చెప్పిన విషయాలు విన్న ఆ స్నేహితుడు ఎంతో సంతోషపడి నేను రేపు చాలా మందిని పిలిచి ఒక పెద్ద మీటింగ్ ఏర్పాటు చేస్తాను, వాళ్ళందరికీ గురువుగారి గురించి నాకు చెప్పినట్లుగానే చెప్పాలి అంటాడు. సమస్యంతా ఇక్కడే ఉంది. స్టేజి మీద నిలబడిన తరువాత ఆ గుండె దడలో ఏమీ బయటకు రాదు.

"గురువుగారు అమెరికాలో .. కాదు కాదు... ఇండియాలో... శిరిడీలో సత్సంగం ఇచ్చినప్పుడు ... శిరిడీలో... కాదు, ఆ ఊరి పేరేంటి? తిరుపతి... తిరుపతి కాదు అంటే తిరువణ్ణామలైలో"





అంటూ తడబడతారు (నవ్వులు). మెదడు శూన్యం అయిపోతుంది. మీరు అన్నింటినీ మర్చిపోతారు. ఊర్లపేర్లు చివరికి నా పేరు కూడా మర్చిపోతారు (గురువుగారు నవ్వుతూ...) మనకు సహజసిద్ధంగా ఉండే మాట్లాడే సామర్థ్యం కూడా దెబ్బతింటుంది.


మీరు చేసేది ఒక ప్రదర్శన అయినపుడు, ఒక విన్యాసం, ఒక ప్రత్యేకమైన పని అయినపుడు సహజమైన సామర్థ్యం కూడా దెబ్బతింటుంది. మనం ఏదో సాధించాలి అనే భావన వచ్చినప్పుడు, దాని ఫలితాన్ని గురించి అభద్రతాభావం కలిగినపుడు ఇలాగే జరుగుతుంది. అది మన శక్తి సామర్థ్యాలను దెబ్బతీసి జీవితాన్ని సంతోషపడనీయకుండా చేస్తుంది. అందుకే నేను అటువంటి భావనలకు తావివ్వను. నేను ఎవ్వరినీ పొగడను (గురువుగారు నవ్వుతూ...) అలా పొగిడి వాళ్ళకు నష్టం కలిగించడం నాకు ఇష్టముండదు. మీరు ఏం చేస్తున్నారనేది ముఖ్యం కాదు, ఎలా చేస్తున్నారనేది ముఖ్యం.

ముందు బాబాకు సంబంధించిన విషయాలలో వీటిని అభ్యాసం చేయండి. బయట ప్రపంచం ఎంతో మాయ చేస్తుంది. అక్కడ ఇటువంటి దృష్టితో ఉండటం చాలా కష్టం. ఇక్కడ అది తేలిక. ఎందుకంటే ఇక్కడ మనకు ప్రేమ ఉంది. మనకో లక్ష్యం ఉంది. అనుబంధం ఉంది. కాబట్టి ఇక్కడ అభ్యాసం చేయండి. ఒక్కసారి మనస్సుకు ఆ రుచి తెలిసాక దానిని మీ జీవితంలో మిగతా పార్శ్వాలలో అన్వయం చేసుకోవచ్చు. అప్పుడు నేను చెప్పినట్టు ప్రతిదీ – అమెరికాలో ఉండటం, కుటుంబం ఉండటం, ఇల్లు, కారు ఉండటం, ఆఫీసుకు పోవడం, పని చెయ్యడం – ఇలా ప్రతిదీ మీరు ప్రేమను వ్యక్తీకరించడంలో భాగమే అవుతుంది. మనం పట్టించుకోవలసిన అంశం మాత్రం కేవలం ప్రేమే. కాబట్టి ఆ ప్రేమ విషయం గురించి జాగ్రత్త వహించండి. అది ఎలా వ్యక్తమయ్యేలా చూడాలి అనే విషయాన్ని బాబా చూసుకుంటారు. ప్రేమను వ్యక్తం చేయడానికి సిద్ధంగా ఉండండి. ప్రేమను వ్యక్తం చేయడానికి ఉత్సుకతతో ఉండండి. ప్రేమను వ్యక్తపరిచేటందుకు ప్రతి అవకాశాన్నీ అందిపుచ్చుకోండి. మీరు ఎంతగా వ్యక్తం చేస్తారో అది అంత దృఢంగా, ఎక్కువగా పెరుగుతుంది.

## ఎంపిక *జూన్ 2015*

**భక్తుడు :** గురువుగారూ! సద్గురు స్థితిని క్షణమాత్రంగానైనా అనుభవంలోకి తెచ్చుకోవడం గురించి మీరు చెబుతూ, ఆ స్థితి ఒక్క క్షణమాత్రంగానైనా అనుభవంలోనికి వచ్చాక ఆ ఆనందానుభవాన్ని నిలుపుకోవడం లేదా దానిని వదులుకోవడం మా చేతుల్లోనే ఉందని తెలుస్తుంది అన్నారు. నిజంగా ఆ అనుభవాన్ని నిలుపుకోవడం లేదా వదులుకోవడం అనే ఎంపిక (ఛాయిస్) మా చేతుల్లోనే ఉందా?


హైదరాబాద్, 1998




**గురువుగారు :** అది ఎంపికే, అది మన చేతుల్లోనే ఉంది, కానీ నిజానికది ఎంచుకోక తప్పని నిర్బంధమైన ఎంపిక. అది మన ఎంపికే అనిపిస్తుంది. కానీ వాస్తవంగా మనకు మరోలా ఎంచుకునే అవకాశం ఉండదు. ఈ విషయంలో మాత్రమే కాదు, జీవితంలో ప్రతి విషయంలోనూ ఇలాంటి పరిస్థితే ఉంటుంది. మన 'ఎంపిక' అనే విషయం చాలా గమ్మత్తుగా ఉంటుంది. ఇలా ఎంపిక చేసుకోవడమనేది చాలావరకు మన పాత అలవాట్ల మీద ఆధారపడి ఉంటుంది. నిరంతరం క్రొత్తదనం కోసం చూడటం మన అలవాటు కనుక మనం ఆనందానుభవం నుండి ప్రక్కకు మరలుతాం.

**భక్తుడు :** గురువుగారూ! మాకు వచ్చిన అనుభవాలన్నీ (మీరు) ఇచ్చినవే. వాటిని పొందడానికి మేము ఏమీ చెయ్యలేదు. కనీసం ఆ అనుభవాలు రావడం ఆగకుండా ఉండటానికైనా మేము చెయ్యగలిగింది ఏదైనా ఉందా?

**గురువుగారు :** ప్రతిదీ ఇచ్చిందే, దేనినైనా 'ఆపడం' ఎలా సాధ్యం? ఆ ఆనందానుభవం మాత్రమే కాదు, మన అనుభవాలన్నీ ఇచ్చినవే. ఆ అనుభవాలను మనం ఎలా చూస్తాం. మనం వాటిని ఎలా స్వీకరిస్తాం, వాటిని ఎలా అర్థం చేసుకుంటాం అనే ఈ విషయాలను బట్టి ఆ అనుభవం మన ఎంపికే అన్న భావన వస్తుంది. మీ జీవితంలో మీకు ఎదురయ్యే ఏ అనుభవాన్నైనా తీసుకోండి. అది నిజంగా మీరు ఎంచుకున్నదేనా? ఉదాహరణకు, మీరు ఈ మార్గాన్ని (సాయిపథాన్ని) ఎన్నుకున్నారని అనుకుంటున్నారు. కానీ ఇది నిజంగా మీ ఎంపికేనా? నిజంగా మనకు అలా ఎంపిక చేసుకునే సామర్థ్యం ఉందా?

సాధారణంగా అందరూ వాళ్ళ జీవితాలు వారి నిర్ణయం ప్రకారమే ఉన్నాయనుకుంటారు. తమకు అలా ఎంపిక చేసుకునే స్వేచ్ఛ ఉందనుకుంటారు. ఎవరైనా ఆధ్యాత్మిక పథంలోకి వస్తే వారికి ఇక వ్యక్తిగత నిర్ణయాలు ఉండవనే భావనతో ఉంటారు. అంతకుముందు వాళ్ళకేదో ఆ అవకాశం ఉన్నట్లు, ఆధ్మాత్మిక మార్గంలోకి వచ్చిన తర్వాత దానిని కోల్పోతారని అనుకుంటారు. నేనేమంటానంటే మీరిప్పుడు కోల్పోవడానికి ఏమీ లేదు, ఎందుకంటే అసలు మీకెప్పుడూ అలా ఎంపిక చేసుకునే అవకాశం లేదు! (గురువుగారు నవ్వుతూ) ఏ విషయాన్నైనా తీసుకోండి – మీరు ఎక్కడ నివసిస్తారు, ఎలాంటి దుస్తులు ధరిస్తారు. ఏమి తింటారు, ఎప్పుడు నిద్రలేస్తారు – ఇలా ఏదైనా చిన్న విషయాన్ని, ఏ ప్రాముఖ్యతా లేనటువంటి విషయాన్ని తీసుకొని దాని గురించి లోతుగా ఆలోచించడానికి ప్రయత్నించండి. మీకు పెద్దగా ఎంపిక చేసుకునే అవకాశం లేదనే విషయం తెలుస్తుంది.

**భక్తుడు :** కానీ చాలాసార్లు మాకు ఎంపిక చేసుకునే అవకాశం ఉన్నట్లనిపిస్తుంది.




**గురువుగారు:** నిజమే, అది అలా అనిపిస్తుంది.

**భక్తుడు:** ఉదాహరణకు, సత్సంగంలో నేను ఇక్కడైనా కూర్చోవచ్చు లేదా మీ ముందు అక్కడైనా కూర్చోవచ్చు.

**గురువుగారు:** అలాకాదు, ఒకవేళ అది మీ ఎంపికే అయినట్లయితే మీరు ఇక్కడ కూర్చొని ఉండేవారు. (గురువుగారు తమ పాదాల చెంత ప్రదేశాన్ని చూపుతూ..) (నవ్వులు...) మీరు వచ్చేటప్పటికి ఉన్న చోటులో ఉత్తమమైన ప్రదేశాన్ని ఎంచుకునే ప్రయత్నం చేస్తారు. ఆ జాగా దొరక్కపోతే మళ్ళీ ఉన్న దాంట్లోనే మంచిది అనుకున్న చోటులోనే కూర్చోవాలనుకుంటారు. కానీ అలా చివరికి దొరికిన దానితో సంతృప్తిపడి, "ఇది నేను ఎంచుకున్న స్థానం" అనుకుంటారు.

**భక్తుడు:** కానీ, మా అనుభవంలో ఎంచుకునే అవకాశం ఉన్నట్లనిపిస్తుంది. ఇక్కడ కూర్చోవచ్చు లేదా అక్కడ కూర్చోవచ్చు.

**గురువుగారు:** అవును. నేను చెప్పేదీ అదే, ప్రతి ఒక్కరూ అలాగే అనుకుంటారు. ప్రతి ఒక్కరూ ఇది నేను ఎంపిక చేసుకున్నదే, నేను ఎంపిక చేసుకున్నదే అంటారు. ఆ భావననే వేదాంత పరిభాషలో 'అజ్ఞానం' అన్నారు. ఆ 'అజ్ఞానం' మీ తలకు వెనుక భాగంలో ఎక్కడో లోపల లేదు. అది మన ప్రతి పనిలో, ప్రతి ఆలోచనలో, ప్రతి శ్వాసలోనూ ఉంది. అది అలా మనల్ని మాయ చేస్తూ ఉంటుంది.

**భక్తుడు:** అలా అయినప్పుడు అది నా ఎంపిక కాకుండా చేసేది ఏమిటి?

**గురువుగారు:** అన్వేషించండి, తెలుసుకోవడానికి ప్రయత్నించండి! దానిని అనుభవంలోనికి తెచ్చుకోవడం అంత సులభం కాదు. ఊరకే, "ఇప్పటిదాకా నేను ఎంపిక చేసుకోవచ్చు అనుకున్నాను, కానీ మనకు ఆ అవకాశం లేదని చెప్పారు. కాబట్టి ఇక నేనలా ఆలోచించడం మానేస్తాను" అని అనుకొన్నంత మాత్రాన సరిపోదు. అది అంత సులభం కాదు. ఎవరైనా దానిని తెలుసుకొని అనుభవంలోకి తెచ్చుకోగలిగితే మనకు అనుభవమయ్యే ఆ స్థితిని రకరకాల సాంప్రదాయాలు, "ఎంపికలేని ఎరుక" అని పిలుస్తాము. మనలో ఎవ్వరికీ ఎంపిక చేసుకునే అవకాశం లేదు. కానీ మనకు ఈ విషయంపట్ల ఎరుక ఉండదు. మన మొత్తం ఉనికి ఎంత నిర్బంధమైనదో, అది అలా ప్రవాహంలో ఎలా కొట్టుకుపోతుందో తెలిస్తే, ఆ ప్రవాహాన్ని గుర్తించడం నేర్చుకోగలిగితే – ఏదో ఒక్క క్షణం గుర్తించడం కాదు, దానిని నిరంతర అనుభవంగా గుర్తించగలిగితే – అప్పుడు మనం ఆ "ఎంపిక లేని ఎరుక"లో ఉంటాము. ఎంపిక చేసుకునే అవకాశం లేని స్థితి అందరికీ ఉంటుంది. అది కాదు సమస్య. అసలు సమస్య 'ఎరుక' – మనకు ఆ ఎరుక లేదు (నవ్వులు...)

**భక్తుడు:** మనకు ఎంపిక చేసుకునే అవకాశం లేదనే ఎరుక కలిగినపుడు, అలాంటి స్థితిలో ఉండి పోవడం మంచిదేనా, గురువుగారూ?

**గురువుగారు:** అవును, అలా ఉండటం చాలా మంచిది.




**భక్తుడు :** ఎందుకంటే అదే సత్యం కనుకనా?

**గురువుగారు :** అవును అదే సత్యం. సత్యంలో ఉండటం కంటే ఉన్నతమైన స్థితి ఏముంటుంది?

**భక్తుడు :** గురువుగారూ! మేము మా గతం, భావోద్వేగాలు, పరిస్థితులు ఇలా ఎన్నో బంధనాలకు లోబడి ఉండటం వలన మా ఎంపిక నిర్బంధంగా మారుతుంది అనడం సమంజసమేనా? మేము బంధనాల నుండి స్వేచ్ఛను సాధిస్తే అప్పుడక్కడ ఎంపిక చేసుకోవడానికి పూర్తి స్వాతంత్ర్యం ఉంటుందా?

**గురువుగారు :** నిజమే, మీరు దానిని బంధనాలు, స్వేచ్ఛ అంటున్నారు. నేను దానికి అసహాయత, సామర్థ్యం అనే పదాలను వాడతాను. తప్పనిసరై ఎంపిక చేసుకోవాల్సి వచ్చిన తక్షణం మనకు మన అసహాయత అనుభవమవుతుంది. అది బంధనాలకు లోబడి ఉండటం వంటిది కాదు. మనం ఎంచుకోవాలని ప్రయత్నిస్తాం కానీ ఎంచుకోలేం. చివరికి ఇక తప్పనిసరిగా ఎంచుకోవాల్సి వచ్చినప్పుడు, మనం ఒక దానిని ఎంపిక చేసుకుంటాం. అలా ఎంపిక చేసుకున్న తక్షణం మనకు ఒక రకమైన అసంతృప్తి అనుభవమవుతుంది. మనం నిస్సహాయంగా ఎంచుకోవాల్సి రావడం దానికి కారణం. కాబట్టి నిజంగా మనకి కావాల్సింది సరిగ్గా ఎంచుకునే సామర్థ్యం. ఎటువంటి 'ఎంపికాలేని ఎరుక' అనే స్థితిలో ఉంటే మనం సరిగ్గా ఎంచుకుంటాం అని చెబుతారు. 'ఎంపిక లేని ఎరుక' అనే స్థితిని ఎందుకు సాధించాలి అంటే సరిగ్గా ఎంపిక చేసుకోవడానికి (గురువుగారు నవ్వుతూ..) అందులోని పరస్పర వైరుధ్యమంతా అదే. అందుకని నిస్సహాయస్థితిని కాకుండా మనం ఎంపిక చేసుకునే సామర్థ్యాన్ని పొందుతాము.

**భక్తుడు :** కాబట్టి మన ఎంపికలు అనేవి మన వాసనలు, అలవాట్ల మీద ఆధారపడి ఉంటాయన్నమాట.

**గురువుగారు :** అవును, మన పాత అలవాట్ల మీద ఆధారపడి ఉంటాయి. మన పాత అలవాట్ల బలం మనల్ని నడిపిస్తూ ఉంటుంది. వాటినే రకరకాల సాంప్రదాయాలలో ప్యాట్రన్స్ అని, వాసనలని, సంస్కారాలని, కర్మలనీ.. ఇలా రకరకాల పేర్లతో పిలుస్తారు. మీరు వాటిని ఏమని పిలిచినా సరే అందులో విషయం (సారం) ఇదే.

**భక్తుడు :** ఆధ్యాత్మిక మార్గం ఈ వాసనలను , అలవాట్లను తుడిచిపెట్టి (మనల్ని) అహంకారరహితంగా మార్చడానికి ప్రయత్నించదా?

**గురువుగారు :** అహంకారం అంటే ఏమిటి? మనం ఇప్పటివరకూ చేసిన పనుల ఫలితమే కదా. దానినే మనం అహంకారం అంటాము. కాబట్టి కొంతమంది అహంకారాన్ని వదలిపెట్టండి అంటారు. ఇంకొందరు వాసనలను నాశనం చెయ్యండి అంటారు లేదా ప్యాట్రన్స్‌ను పోగొట్టుకోండి అంటారు. ఇవన్నీ పరిభాషా పదజాలం మాత్రమే. ఆ పదం ఏమైనా సరే, జరగాల్సిన పని మాత్రం ఇదే.



**భక్తుడు:** గురువుగారూ! శ్రీసాయిబాబా, రమణమహర్షి వంటి మహాత్ములకు నిజంగా ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుందా?

**గురువుగారు:** లేదు, వారలా ఎంచుకోవడం ఉండదు. అస్సలు వారికంటూ ఎటువంటి (ఇష్టాయిష్టాలు) ఎంపికలూ ఉండవు. ఎందుకంటే జరుగుతున్నదానితో కలసి అప్పటికప్పుడు అలా సాగిపోతారు. మనం ఎంపిక చేసుకున్నట్లు వాళ్ళు ఎంపిక చేసుకోరు. ముఖ్యంగా వారి వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలలో ఎటువంటి ఎంపికలూ ఉండవు.

**భక్తుడు:** వాళ్ళకు ఇష్టాయిష్టాలు లేకపోవడం ఎంపిక చేసుకోకపోవడానికి కారణమా?

**గురువుగారు:** వాళ్ళకు ఇష్టాయిష్టాలు ఉండవు. వారికి ఎటువంటి ఎంపికలూ ఉండవు. వారికి ఎంచుకునేందుకు ఏమీ ఉండదు.

**భక్తుడు:** గురువుగారూ! మహాత్ములు జరుగుతున్నదానితో కలసి "అప్పటికప్పుడు ఆ క్షణంలో అలా సాగిపోతారు" అన్నారు కదా. దాని అర్థం ఏమిటి? ఏదైనా సందర్భంలో ఎంపిక చేసుకోవడానికి ఒకటి కంటే ఎక్కువ అవకాశాలు ఉన్నప్పుడు అప్పటికప్పుడు అలా సాగిపోతారనడంలో అర్థం ఏమిటి?

**గురువుగారు:** ఏదో ఒకదానిని ఎన్నుకోవడం అంటే జరుగుతున్నదానిని మనం ప్రతిఘటిస్తున్నట్లు లెక్క. ఎవరికైతే ఎటువంటి ప్రతిఘటన ఉండదో, ఎవరైతే ప్రతి దానిని సమంగా తీసుకోగలరో వాళ్ళు ఆ క్షణంలో ఏమి జరిగినా దానితోపాటు కలసి సాగిపోతారు.


**భక్తుడు:** ఎప్పుడైతే అప్పటికప్పుడు అలా సాగిపోవడం జరుగుతుందో అక్కడ మన ఎంపికంటూ ఉండదంటారా?

**గురువుగారు:** అవును. ఎప్పుడైతే మనకు ఎంపికంటూ ఉండదో అక్కడ అప్పటికప్పుడు అలా సాగిపోవడం జరుగుతుంది. (నవ్వులు) కానీ మనం అనుకునే ఆ ఎంపికలేని స్థితి నిజంగా అప్పటికప్పుడు సంభవమవుతుందా? మళ్ళీ ప్రశ్నించుకోండి. మనం కొన్ని విషయాలు అప్పటికప్పుడు జరిగాయి అంటాము. కానీ అవి నిజంగా అలాగే జరిగాయా? నేను మీకు సమాధానాలు ఇవ్వడం లేదు. మీరు ఆలోచించేలా చెయ్యడానికి ప్రయత్నిస్తున్నాను. కేవలం నాది "ప్రయత్నం" మాత్రమే (నవ్వులు...)

**భక్తుడు:** గురువుగారూ! సంకల్పం (ఇచ్ఛ) అంటే ఏమిటి?

**గురువుగారు:** మనం ఒక దానిని ఎంపిక చేసుకుంటున్నాం అనే భ్రమను కలిగించేదే 'సంకల్పం' అని నేననుకొంటాను. మనమిలా సంకల్పిస్తూ, సంకల్పిస్తూ, ఆ భ్రమలో భాగం కావడానికి సిద్ధమైతే, అదే మన చివరి సంకల్పమవుతుంది (నవ్వులు..)

**భక్తుడు:** మరి భగవంతుని సంకల్పం అంటే ఏమిటి?



**గురువుగారు :** సరిగ్గా ఎంపిక చేసే సామర్థ్యం లేదా సంకల్పించే సామర్థ్యం – అది భగవంతుడంటే. భగవంతుని సంకల్పం అంటే అదే. "నీ సంకల్పం నెరవేరుగాక" అని అంటే, ఎవరైతే సంకల్పిస్తున్నారో ఆ భగవంతునితో ఒక్కటి కావడం, ఆయన సంకల్పంతో ఒక్కటి కావడం. అంటే భగవంతుని సంకల్పంతో ఒక్కటి కాగల సామర్థ్యాన్ని పొందడానికి ప్రయత్నించడం. 'ఎంచుకోవడం' అనే పదానికి బదులు 'సంకల్పం' అనే పదాన్ని వాడారు. ఇంగ్లీషులో ఈ రెండింటికీ అర్థం ఒక్కటే. భగవంతునికి మాత్రమే ఎంపిక చేసే సామర్థ్యం ఉంది అని వారంటున్నారు. మీకు ఆ సామర్థ్యం లేదు! కాబట్టి అలా పరిపూర్ణంగా సంకల్పించడాన్ని సాధించడానికి ప్రయత్నించండి. "పరలోకంలోని తండ్రి వలెనే మీరు పరిపూర్ణులు కండి" అని బైబిల్ చెబుతుంది. అదీ అందులోని సందేశం.

మీరు భగవంతుని సంకల్పానికి కట్టుబడి ఉన్నట్లుగా అనిపిస్తుంది. కానీ అలా కట్టుబడి ఉండరు. కట్టుబడి ఉండటం అంటే మీరు భగవంతుని సంకల్పంతో ఒక్కటి కావడం లాంటిది – మీ సంకల్పం, ఆయన సంకల్పం ఇలా రెండు లేకుండా, రెండూ ఒక్కటిగా మారుతాయి. అప్పుడు మీరు పరలోకంలోని తండ్రి అంతటి పరిపూర్ణులవుతారు. వాళ్ళు పరిపూర్ణత్వం, అపరిపూర్ణత్వం అనే పదాలలో చెప్పారు. నేను అసహాయత, సామర్థ్యం, శక్తి అనే పదాలలో చెప్పాను, ఇంకొకరు మరో రకంగా స్వేచ్ఛ, కట్టుబాట్లు అనవచ్చు. ప్రాథమికంగా అందరూ ఒకే విషయాన్ని గురించే చెబుతున్నారు.

**భక్తుడు :** గురువుగారూ! మనకు ఎంపిక చేసుకునే అవకాశమే లేకపోతే, మన జీవితాల మీద మనకు అదుపు లేదనే కదా?

**గురువుగారు :** అదో అంతుబట్టని విషయం (మిస్టరీ). ఒక్కసారి మీకు ఎంపిక చేసుకునే అవకాశం లేదని తెలిశాక అది మిమ్మల్ని చాలా బాధకు గురిచేస్తుంది. ఎందుకంటే మీరు ఎంపిక చేసుకునే అవకాశాలు ఉండటాన్ని ఇష్టపడతారు. మీరు ఎంపిక చేసుకోవాలని కోరుకుంటారు. ఒకవేళ నేను మీకు ఎంపిక చేసుకునేందుకు అవకాశాలు లేవని చెప్పాననుకోండి. అది ఒక దండనలా అనిపిస్తుంది. మీరేదో స్వేచ్ఛను కోల్పోయినట్లు, నిస్సహాయులుగా మారినట్లు అనిపిస్తుంది. "మన చేతులలో ఏమీ లేదు, ఇది ఎంతటి విచారకరమైన పరిస్థితి" అనిపిస్తుంది. కానీ దానిని మరో కోణంలో చూసినట్లయితే మీరు దానిని ఇష్టపడతారు. మీరు ఎప్పుడైతే ఆ స్థితిని ఇష్టపడటం మొదలుపెడతారో అప్పుడు క్షణమాత్రంగా ఉన్న ఆ పరిపూర్ణత్వస్థితి మీకు స్పష్టంగా గోచరమవుతుంది.


కొంతమంది అంతా ప్రారబ్ధకర్మ. మీరు చెయ్యగలిగింది ఏమీ లేదు, ప్రతి క్షణమూ – మీరలా కదిలినా, కూర్చొన్నా, ఊపిరి తీసుకుంటున్నా, తీసుకోకపోయినా ఇలా ప్రతి విషయం ముందే నిర్ణయమైపోయి ఉంటుంది అంటారు. కానీ అది మీరనుకునేలా మన చేతుల్లో లేకుండా




ఉండటమో లేక ముందే నిర్ణయమైపోవడంలానో ఉండదు. అది మనం అస్సలు మార్చలేనటువంటి, మన చేతుల్లో ఏమీ లేనటువంటి స్థితి కాదు. కొంతవరకు మీరు దానిని మార్చుకోవచ్చు, అది పూర్తిగా ముందే నిర్ణయించబడి ఉండదు (గురువుగారు ఒక పెన్నును పైనుండి క్రిందవేసి మధ్యలోనే దానిని పట్టుకున్నారు) ఈ పెన్ను క్రిందపడటం అనేది ముందుగా నిర్ణయమైపోవడం వంటిది, అది క్రిందపడే వేగం దాని బరువు మీద, పొడవు మీద, గాలి సాంద్రత మీద ఆధారపడి ఉంటుంది. ఇవన్నీ కలసి అది ఎంత వేగంగా క్రిందపడాలో నిర్ణయిస్తాయి. కానీ నేను దానిని మధ్యలోనే పట్టుకుంటే ముందుగా నిర్ణయమై పోవడమనేది ఎక్కడుంది? మనకు ఈ అవకాశమే లేకపోతే అప్పుడు ఆధ్యాత్మికత, సద్గురువు, ముక్తి, మోక్షం మొదలైన వాటికి అర్థమే లేదు. మీరంతా పొందడానికి ప్రయత్నిస్తున్న ఆ స్వేచ్ఛ ఏమిటి? మీరు ముందుగా నిర్ణయించబడిన విధివ్రాత నుండి స్వేచ్ఛను పొందాలనుకుంటున్నారు. మీరు దీనిని అంగీకరించకపోతే, మీరు పొందే ఆ స్వేచ్ఛ కూడా మీ విధివ్రాతలో భాగమైతే అది నిజంగా ముక్తిని పొందడమవుతుందా? అదృష్టమా, అనుగ్రహమా? విధివ్రాతా లేక మన సంకల్పమా? – ఇవి చాలా పెద్ద ప్రశ్నలు. వీటి మీద పుస్తకాలకు పుస్తకాలు వ్రాసారు కదా? (గురువుగారు నవ్వుతూ..) కానీ ఈ మీమాంస మనల్ని ఎక్కడికీ తీసుకెళ్లదు. ఆలోచించి చూడండి. మీకు నిజంగా ఎంపిక చేసుకునే అవకాశం ఉందా? మిమ్మల్ని (ఏదైనా విషయాన్ని గురించి) ఆలోచించినట్లు చేసేది ఏమిటి? (ఏదైనా విషయాన్ని) మీ అనుభవంలోనికి తీసుకువచ్చేది ఏమిటి? మీకు ఎంపిక చేసుకునే అవకాశం ఉంటే మీరు ఆనందంగా ఉంటారా? మన ఎంపికంటూ లేని స్థితి అంటే ఏమిటి? ఆ స్థితంటే మనకు ఎందుకంత విచారం? వీటి గురించి ఆలోచించండి. అది మీరనుకునే ఎంచుకునే అవకాశంలేని స్థితి వంటిది కాదు. దానిని గురించి మాటల్లో చెప్పడానికి పదాలు లేవు. అదీ అసలు సమస్య.

**భక్తుడు:** గురువుగారూ! ఎవరైనా నిజంగా ఏదీ మన చేతుల్లో లేదనే విషయాన్ని అంగీకరించినపుడు దానితోపాటూ వారికి గొప్ప భద్రతాభావం కలగాలి కదా. ఎందుకంటే జరిగేవి మన ఇచ్ఛానుసారం జరగకపోతే మరెవరి ఇచ్ఛానుసారమో జరుగుతూ ఉండాలి. ఆ 'మరొకరో' లేదా 'మరొకటో' నా జీవితంపట్ల జాగ్రత్త వహిస్తుంటే ఇక ఆందోళపడాల్సిన అవసరం ఏముంది? నా ఉద్దేశ్యం ఏమిటంటే ఎవరైనా మన చేతుల్లో ఏమీ లేదని అంగీకరించే స్థితిలో ఉంటే వారి భద్రతాభావం చాలా ఎక్కువ కావాలి.

**గురువుగారు:** అవును. సరిగ్గా ఇక్కడే బాబా అవసరమవుతారు. బాబా మీకు ఆ భద్రతాభావాన్ని ఇస్తారు. దానివల్ల మీరు మన ఎంపికేలేని ఆ స్థితిని గురించి ఎక్కువగా తెలుసుకుంటారు, దానిని ఆస్వాదిస్తారు. మనకోసం ఎంపిక చేసే బాధ్యతను బాబాకు అప్పగించి, "నేను ఆ బాధ్యతను బాబాకు




అప్పగించాను. నా జీవితాన్ని ఆయన నడిపిస్తారు. నాకోసం నిర్ణయాలు బాబా తీసుకుంటారు” అని భావిస్తారు. కానీ నిజానికి మీరు ఎంపిక చేసే బాధ్యతను ఆయనకు అప్పగించడం లేదు. కానీ అది అలా అనిపిస్తుంది. అదే మీకు భద్రతాభావాన్నిచ్చి మీరు మరింత ముందుకెళ్ళేలా చేస్తుంది. లేకపోతే మీరు ముందుకు వెళ్ళలేరు. ఎందుకంటే అది మీరు కూర్చొని ఉన్న కొమ్మను మీరే నరుక్కోవడంలా ఉంటుంది. దానివల్ల మీరు క్రిందపడతారు, కాబట్టి మీరు ఆ పని చెయ్యరు. ఇక్కడే సద్గురువు పాత్ర ముఖ్యమవుతుంది. సద్గురువు వలన మీ పని సులువవుతుంది. కానీ కొంతమంది దీని గురించి సానుకూలధోరణిలో ఆలోచించకుండా తమ స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను కోల్పోయామనుకుంటారు. వారి ఎంపికలన్నీ పోయాయనుకొంటారు. వారికి తామేదో బంధనాలలో చిక్కుకొని దాదాపు బానిసలుగా మారినట్లు అనిపిస్తుంది. కానీ అది నిజం కాదు. వారలా అనుకొంటున్నారంటే వారు అందులోని అందాన్ని చూడలేకపోతున్నారు. మీరు చాలా మంచి విషయాన్ని ప్రస్తావించారు – మనల్ని ప్రేమిస్తూ, మనకన్నా మంచిగా నిర్ణయాలు తీసుకునే సద్గురువుకు మన కోసం నిర్ణయాలు తీసుకునే బాధ్యతను అప్పగించాక మనం భద్రతాభావాన్ని, ఆనందాన్ని అనుభవిస్తాము.

ఎప్పుడైతే మీరు నిజంగా ఎంపిక చేసుకోవడానికి వేరే అవకాశం లేదనుకుంటారో – అప్పుడు జరుగుతున్నది మీకు నచ్చినా, నచ్చకపోయినా, మీకు అర్థమైనా, కాకపోయినా, అసలు ఏమి జరుగుతుందో మీకు తెలియకపోయినా, ఇదంతా ఎక్కడ ముగుస్తుందో తెలియకపోయినా (నవ్వులు..) ఏమీ పట్టించుకోరు. ఎందుకంటే మీకు ఆ భద్రతాభావం ఉంది. నిజమైన మార్గం అప్పుడు మొదలవుతుంది, మీరు నిజమైన ప్రేమను అనుభవించడం ప్రారంభిస్తారు. ప్రేమ యొక్క అనుభవం అలా ఉంటుంది!

**భక్తుడు:** గురువుగారూ! మనం మన అసహాయతను అంగీకరించి, మనకు సాయం అందుతుందని కూడా తెలుసుకున్నాము అనుకొందాం – ఇక మేము చేసేది ఏమిటి? ఇలాంటి పరిస్థితులలో “సరే, జరిగేది ఎలాగూ నేను కోరుకున్నది కాదు” అనే ఒక రకమైన నిర్లిప్తత చోటు చేసుకుంటుంది కదా?

**గురువుగారు:** చాలామంది విషయంలో ఏం జరుగుతుందంటే మనం తీసుకునే నిర్ణయాలపట్ల (మన ఎంపికపట్ల) మనకు నమ్మకం ఉండదు. మనమెప్పుడూ డోలాయమైనమైన స్థితిలో కొట్టుమిట్టాడుతూ ఉంటాము. ఇది మంచిదా లేక చెడ్డదా? ఇది సరైనదా లేక సరైనది కాదా? మనకు నిజంగా ప్రయోజనకరంగా ఉంటుందా లేదా... ఇలా డైలమాలోఉంటాం. కానీ మనం ఒక్కసారి సద్గురువు చెయ్యిపట్టుకున్నాక, మనం భయం లేకుండా నిర్ణయాలు తీసుకుంటాం. కాబట్టి మనం తీసుకునే నిర్ణయాలను తీసుకోకుండా ఆగడం ఉండదు. మనం తీసుకున్న నిర్ణయాలను ఆనందంగా ఆస్వాదిస్తాం.




అంతకుముందు మనం తీసుకునే నిర్ణయం యొక్క భారాన్నంతా మనమే మోస్తూ ఉంటాం కాబట్టి అలా ఆస్వాదించలేము. సద్గురువు దరికి చేరుకున్నాక ఇది పూర్తిగా భిన్నమైన విషయంగా మారిపోతుంది.

**భక్తుడు:** అంటే మనం తేలికైన హృదయంతో, ఒక రకమైన భద్రతాభావంతో నిర్ణయాలు తీసుకుంటామా?

**గురువుగారు:** ఎక్కువ భద్రతాభావం ఉంటుంది. నిజమే. దానిని తేలికైన హృదయం అంటానంటే అనవచ్చు. కానీ అది కేవలం తేలికైన హృదయమే కాదు, అది తేలికపడిన హృదయం, భారంలేని హృదయం. నిర్ణయం తీసుకోవడం అనే భారమంతా తీసివేయడం వలన హృదయం తేలికపడుతుంది.

**భక్తుడు:** గురువుగారూ! ఈ మొత్తం క్రమంలో మన ప్రయత్నానికి తావెక్కడుంది?

**గురువుగారు:** ఆ భద్రతాభావాన్ని ఇంకా ఇంకా పెంచుకోవడానికి, ఇంకా ఇంకా అనుభవంలోకి తెచ్చుకోవడానికి, స్వేచ్ఛాయుతమైన జీవితం గడపడానికి ప్రయత్నించడం – స్వేచ్ఛగా జీవించాలి, అజాగ్రత్తగా కాదు – దానికోసమే మన ప్రయత్నమంతా.

**భక్తుడు:** కాబట్టి చివరికి మొత్తం శరణాగతి వద్దకు వస్తుంది – శరణాగతి కోసం గురువు వద్దకు వెళ్లడమేగా?

**గురువుగారు:** మీరు శరణు పొందడానికి గురువు దగ్గరకు వెళ్లడం జరగదు. ఆయన దగ్గరకు వెళ్తే జరిగేది శరణాగతి. శరణాగతిని పొందడం కూడా మీ చేతుల్లో ఉండదు (గురువు దగ్గర) మీరు అనుభవించే ఆ స్థితినే 'శరణాగతి' అంటారు. సాధారణంగా ఏం జరుగుతుందంటే అందరూ శరణాగతిని ఒక సాధనగా, ఆత్మసాక్షాత్కారానికి ఒక మార్గంగా చూస్తారు. అది మీరు ఎంచుకునే సాధనం కాదు. సద్గురువు మనలో ఆ ప్రేమను కలిగించాలి, ఒక్కసారి మీరు ఆ ప్రేమను అనుభవించడం మొదలుపెట్టాక, శరణాగతి తప్పనిసరి అవుతుంది. అక్కడ మీకు మరో అవకాశం ఉండదు, అక్కడ మరో మార్గం ఉండదు. ఆ ప్రేమ నెమ్మదిగా మన ఇష్టాయిష్టాలను (ఎంపికలను) వదులుకొనేలా చేస్తుంది. మన ఎంపికంటూ లేకుండా పోవాలి అనేది లక్ష్యం కాదు. అది ఏదో ఒక దాని ఫలితం, పర్యవసానం. మన సద్గురువును అంతగా ప్రేమిస్తాం కాబట్టి మన ఇష్టాయిష్టాలు ప్రాధాన్యతను కోల్పోతాయి. మనం ప్రేమించే వ్యక్తి దేనినైతే ప్రేమిస్తారో మనమూ దానినే ప్రేమిస్తాం. మనం ఆయన నిర్ణయంలో భాగమైపోతాము. మనల్ని మనం కోల్పోతాము. మన వ్యక్తిత్వాన్ని కోల్పోయి ఓ గొప్ప ప్రేమలో కలసిపోతాము.

ఎప్పుడైతే మీకిక వేరే మార్గం లేదని, మీరు గమ్యం చేరడానికి వేరే అవకాశం లేదని తెలుసుకుంటారో అప్పుడు మీరు శరణుపొందుతారు, శరణాగతి అంటే అదే.

**గురువు – నిత్యతృప్తుడు. కనుక ఏమీ ఆశించడు.**




# సగుణం - నిర్గుణం *జూలై 2015*



**భక్తుడు :** గురువుగారూ! మేము సద్గురువు రూపం మీద దృష్టిపెట్టాలా లేక ఆయన స్థితి మీద దృష్టి పెట్టాలా?

**గురువుగారు :** సాకారమా లేక నిరాకారమా, గుణమా లేక నిర్గుణమా, ఇదా లేక అదా అని ఎంతోకాలం నుండి ఉన్న పాత సందిగ్ధమే ఇది. మనం సాయిబాబా లేదా రమణమహర్షుల యొక్క రూపానికి భక్తులమా? అసలు రూపం అవసరమా? తాము నిరాకార స్వరూపులమని భగవానే స్వయంగా చెప్పారు. "భగవాన్, మీ నిజతత్వం ఏమిటి?" అని ఎవరో అడిగినపుడు, భగవాన్ అంటే ఇక్కడ సోఫాలో కూర్చొని ఉన్న రూపం కాదని ఆయన చెప్పారు. "రమణులను ఈ ఆరడుగులకు పరిమితం చెయ్యడమెందుకు? రమణులు సర్వవ్యాపి" అని ఆయన చెప్పారు. కాబట్టి ఆయన నిజతత్వం నిరాకారమేనన్న సంగతి స్పష్టమే కదా?

బాబా కూడా అదే విధంగా, "ఎవరైతే ఈ మూడున్నర మూరల దేహాన్ని సాయిబాబా అనుకుంటారో, వారసలు బాబాను చూడనట్లే"నని చెప్పారు. కాబట్టి ఆయన రూపం సాయిబాబా కాదు. అలా అయినప్పుడు మనం బాబాను ఆ రూపంగానే భావించాలా లేక నిరాకారంగా భావించాలా? సాయిబాబా లేదా రమణమహర్షి గురించి ఆయా రూపాలతో కాకుండా ఆలోచించడం మనకు సాధ్యమవుతుందా?

ఈ మధ్య జరిగిన సత్సంగంలో నేను సద్గురువు రూపం యొక్క పాత్రను గురించి వివరించడానికి కిటికీని ఉదాహరణగా చెప్పాను. రకరకాల పరిమితులతో కూడిన మీ స్థితి తలుపులు, కిటికీలు లేని గదిలో ఉండటం వంటిది. మీకు ఊపిరాడటం లేదు. ఇదీ మన ప్రాథమికమైన సమస్య. మనకు మన పరిమితత్వం అనుభవమవుతుంది, వెలుపలికి చూసి ఈ పరిమితత్వం నుండి బయట పడాలనిపిస్తుంది. దీనికి ఒక కిటికీ అవసరం, ఆ కిటికీ సద్గురువు రూపం. మీరు కిటికీకేసి చూసినపుడు మీరు నిజానికి కిటికీ గుండా చూస్తారు. అప్పుడు మీకు నిరాకారమైన అనంతాకాశం గోచరమవుతుంది. సాయిబాబా అటువంటి కిటికీ. మీరు బాబాను చూసినపుడు కేవలం ఆయన రూపాన్ని మాత్రమే కాదు, దానికి ఆవల ఉన్న దానిని కూడా చూస్తారు. కాబట్టి సద్గురువు - సద్గురువు రూపం - నిజమైన మీ స్వరూపాన్ని చూడటానికి, ఆనందం పట్ల మీకుండే అస్పష్టమైన భావనను మీకు స్పష్టంగా అనుభవమయ్యేలా చెయ్యడానికి ఉన్న కిటికీ వంటివారు.

**గురువు మీరు ఎలా ఉండాలని కోరుకుంటున్నారో - అలా మీరు ఉండగలగడమే చేయవలసినది.**




కాబట్టి సగుణరూపం యొక్క ప్రాముఖ్యతను అంటే కిటికీ యొక్క ప్రాముఖ్యతను తెలుసు కోవడానికి ప్రయత్నించండి. రూపంపట్ల భయాన్ని పెంచుకోవద్దు. అనంతత్వాన్ని దర్శించడానికి సద్గురు స్వరూపం కేవలం ఒక కిటికీ మాత్రమే. అది అవసరం, అంతకుమించి వేరే మార్గం లేదు, మీరు దానిని వదలిపెట్టలేరు. మీరు కిటికీలు లేని గదిలో ఉండి ఆకాశాన్ని చూడటానికి ప్రయత్నిస్తే మీరు మీ ఊహాజనితమైన రూపాన్నే చూడగలుగుతారు. అది వెలుపల ఉన్నదాని గురించిన మీ భావన మాత్రమే. "అది ఇలా ఉంటుంది, అది అలా ఉంటుంది" అని మీరనుకోవచ్చు. అది ఎన్నటికీ వాస్తవరూపం కాజాలదు. వాస్తవం అనేది ఊహలకు అతీతంగా ఉంటుంది. ఊరికే ఆలోచన ద్వారా దానిని అనుభవంలోకి తెచ్చుకోలేము. కాబట్టి మీరు దానిని (ఆ సత్యాన్ని) వాస్తవంగా అనుభవంలోకి తెచ్చుకునే క్రమంలో వాస్తవమైన మార్గం అవసరం.

**భక్తుడు :** కాబట్టి సశరీరులైన సద్గురువు ఉండటం అవసరమంటారా?

**గురువుగారు :** అవును, మీరు సశరీరులై ఉన్నంతవరకు అది అవసరమే! మీరు జీవించి ఉన్నారని, మిగతావాళ్ళందరూ జీవించి ఉన్నారని అనుకుంటున్నంతవరకు మీకు సశరీరులైన గురువు అవసరం. ఒకవేళ మీరు, "మరి రమణమహర్షి సంగతేంటి? ఆయనకు సశరీరులైన గురువు లేరు కదా" అని అడిగితే దానికి నా సమాధానమేమిటంటే, రమణులకు సజీవులైన గురువున్నారు. ఆయనే 'అరుణాచలం'. ఆయనకు 'అరుణాచలం' ఎంత సజీవంగా ఉండేదంటే అది ఆయన జీవితం మొత్తాన్ని మార్చివేసింది. భగవాన్ విషయం చాలా అరుదైనది. ఆయన ఎంతటి పరిపక్వ స్థితిలో ఉన్నారంటే ఒక కొండను సైతం ఆయన గురువుగా అనుభూతి చెందగలిగారు. కానీ మనలో చాలా మందికి అంతటి స్థితి లేదు. అనుగ్రహవిశేషంగా మీరు పర్వతాన్ని ఒక గురువుగా అనుభూతి చెందగలిగితే అప్పుడు మీరు ఆ పర్వతంతో అటువంటి సంబంధాన్ని కలిగిఉండవచ్చు. అంతా మీ అవసరం మీద ఆధారపడి ఉంటుంది.

**భక్తుడు :** గురువుగారూ! బుద్ధుని విషయం ఏమిటి? ఆయనకు సద్గురువున్నారా?

**గురువుగారు :** ఆయనకు సద్గురువెవ్వరూ లేరు. అరుదైన మహాత్ముల్లో ఆయన కూడా ఒకరు. కానీ ఆయనెప్పుడూ సద్గురువు అక్కర్లేదని చెప్పలేదు. సజీవమైన సద్గురువెవ్వరూ లేకపోయినా ఆయన నిర్వాణం పొందడానికి సద్గురువు సహాయం తీసుకోకపోయినా ఆయన బుద్ధుని (బుద్ధత్వం పొందిన వ్యక్తి) పాదాల చెంత శరణువేడమనే చెప్పాడు – బుద్ధుని అనుచరునిగా (బౌద్ధ సన్యాసిగా) మారడానికి




ఉచ్ఛరించవలసిన మూడు సూక్తులలో అది మొదటిది. మొదట – “బుద్ధం శరణం గచ్ఛామి” – బుద్ధుని అన్వేషించి ప్రేమతో వారి పాదాల చెంత శరణుపొందాలి. రెండవది “ధర్మం శరణం గచ్ఛామి” – ఆ సత్యమైన ధర్మానికి శరణు పొందాలి. ఇక్కడ మనం కాస్త అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తే బుద్ధుడు కేవలం కిటికీ మాత్రమే. ఆ కిటికీ ద్వారా ఏదైతే వ్యక్తమవుతుందో అదే ధర్మం అని తెలుస్తుంది. మనం ఆ ధర్మాన్ని గ్రహించి ప్రతి విషయం యొక్క స్వభావం అర్థం చేసుకుంటే అది ‘ధర్మం శరణం గచ్ఛామి’. ఆ తరువాత మనం పరిస్థితుల వల్ల సులభంగా ప్రభావితులవుతాం కాబట్టి బుద్ధుని పట్ల, బుద్ధుని ద్వారా వ్యక్తమయ్యే ధర్మం పట్ల మనకు గల ప్రేమను కాపాడటానికి రక్షణ అవసరం. అంటే మనకు సంఘం యొక్క రక్షణ అవసరమవుతుంది. భక్తుల సంఘం. కాబట్టి మూడవది “సంఘం శరణం గచ్ఛామి”. మీరు సంఘానికి శరణు పొందుతారు. ఈ సూక్తులను (త్రిశరణాలను) ఉచ్ఛరించడం ద్వారా అంటే వీటిని నిజంగా అనుసరించడం ద్వారా మీరు బుద్ధునికి నిజమైన అనుయాయులవుతారు.

కాబట్టి బుద్ధుడు చెప్పింది శరణాగతి మార్గమే. శరణం శరణం శరణం – మీరు శరణు పొందాలి, శరణు పొందాలి, శరణు పొందాలి. కానీ ఇప్పుడు అసలు శరణాగతి అనేది బుద్ధునికి సంబంధించిన విషయం కాదని అందరూ అంటున్నారు. అదే సమయంలో వారు “బుద్ధం శరణం గచ్ఛామి” అంటారు. బుద్ధునిది శరణాగతి పథం కాదా, భక్తి మార్గం కాదా? ఆరంభంలో, మధ్యలో, అంతంలో అదో అనంత ప్రేమసాగరం.

కాబట్టి ఆ రోజుల్లో అంతమంది బుద్ధుణ్ణి అనుసరించడానికి కేవలం ఆయన ప్రబోధాలే కారణం కాదని స్పష్టంగా తెలుస్తోంది. బుద్ధుని వద్ద అందరూ పొందింది, ఆయన వారికి బోధించింది మాటలకు అతీతమైనది.అందువల్లనే గొప్ప గొప్ప పండితులు, వేదశాస్త్ర పారంగతులు, శ్రమణులు బుద్ధుని దగ్గరకు వచ్చిన తర్వాత తమ మతాలను, పాండిత్యాన్ని, తమకు సంబంధించిన సమస్తాన్ని వదలిపెట్టి బుద్ధుని అనుయాయులైనారు. దీనంతటికీ వారికి గౌతమబుద్ధుని పట్ల గల ప్రేమే కారణం. మనం కేవలం సూత్రాలను మాత్రమే పరిగణనలోనికి తీసుకుంటే అందులోని జీవాన్ని (సారాన్ని) మనం పట్టుకోలేము. మనం కొంచెం ఆలోచిస్తే వందల వేలకొలది ప్రజలలో మార్పును తీసుకువచ్చింది కేవలం బుద్ధుని బోధనలు మాత్రమే కాదని మనకు ఇట్టే అర్థమవుతుంది. అది కాక మరేదో ఉంది. అది బుద్ధునికి మానవాళి పట్ల గల కారుణ్యం – అన్ని సంవత్సరాలుగా ఆయన పంచిన ప్రేమ. బుద్ధుణ్ణి కలుసుకున్నవాళ్ళు ఆయన పంచిన ప్రేమను అనుభూతి చెందారు. ఆయనపట్ల ప్రేమతోనే వాళ్ళు అన్నింటినీ వదలిపెట్టి సన్యాసులయ్యారు. బుద్ధునిపట్ల గల అపరిమితమైన ప్రేమ వలన



వారు ఆయన గురించి తప్ప మరోదాన్ని గురించి ఆలోచించలేకపోయారు.

**గురువుగారు:** ఒకరోజు బుద్ధుని దగ్గరకు ఒకాయన వెళ్ళి, "ఒకవ్యక్తి బుద్ధుడు (అంటే బుద్ధత్వం పొందిన వ్యక్తి) అని ఎలా చెప్పడం? ఫలానా వ్యక్తి నా సద్గురువు అని నాకెలా తెలుస్తుంది? దానికి కొలమానం ఏమిటి?" అని అడిగాడు. అద్భుతమైన మహిమలు ప్రదర్శించడమా? అద్భుతమైన మహిమలు ప్రదర్శించే వ్యక్తి బుద్ధుడు కానక్కర్లేదు. వేదాంత తత్వాలు అత్యద్భుతంగా వివరించగలగడమా? మంచి వాక్చాతుర్యం ఉన్నవాళ్లెవరైనా ఈ పని చెయ్యగలరు. ఒక నటుడికి మంచి స్క్రిప్ట్ ఇస్తే అతడు కూడా ఇలా చేయగలడు. ఒక వ్యక్తి చాలా తెలివిగలవాడు కావచ్చు. మంచి వక్త కావచ్చు, మంచి ఆచార్యుడు కావచ్చు.కానీ అతను బుద్ధుడు కావాల్సిన అవసరం లేదు. రకరకాల కారణాలు చెబుతూ బుద్ధుడు ఇవేవీ కాదని త్రోసిపుచ్చారు. చివరకి బుద్ధుడు ఇలా అన్నారు: "ఎవరి సమక్షంలో నీకు నిర్హేతుకంగా, ఎటువంటి కారణమూ లేకుండా భద్రతాభావం, ఆనందం కలుగుతాయో – అతను బుద్ధుడు". అంతేకానీ పైకి కనిపించే లక్షణాల ఆధారంగాగానీ, పైకి కనిపించే పనులను ఆధారం చేసుకొనిగాని ఒక వ్యక్తి బుద్ధుడా కాదా అనే నిర్ణయానికి రావడం కుదరదు.

**భక్తుడు:** గురువుగారూ! బాబా సన్నిధిని గాఢంగా ఎక్కడ అనుభూతి చెందగలం?

**గురువుగారు:** నిజానికి చెప్పాలంటే బాబా సన్నిధి ప్రతి చోటా ఉంది. కానీ కాలాన్ని బట్టి, స్థలాన్ని బట్టి మీరు దానిని రకరకాలుగా అనుభూతి చెందుతారు. ఉదాహరణకు, మీరు ఒకసారి శిరిడీకి వెళ్లినపుడు ద్వారకామాయిలో బాబా సన్నిధిని ఎక్కువగా అనుభూతి చెందుతారు. మరోసారి లెండీలో చాలా బాగున్నట్లనిపిస్తుంది. ఇంకోసారి చావడిలో అనిపిస్తుంది. ఆ తరువాతసారి, "అసలు, సమాధి మందిరంలో ఉన్నట్లు మరెక్కడా ఉండదు!" అంటారు. మళ్ళీ అది కూడా మారవచ్చు. ఆ సమయంలో మీ మానసిక స్థితి ఎలా ఉంది, మీ సంస్కారాలు (ప్యాట్రన్స్), మీ అవసరాలు ఎలా ఉన్నాయనే దానిమీద అది ఆధారపడి ఉంటుంది. కాబట్టి మీరెక్కడ ఆకర్షితులవుతున్నారో, ఎక్కడ మీకు బాగుంటుందో అక్కడ ఉండవచ్చు. బాబా సన్నిధి కేవలం ఒక్క చోటులోనే ఉన్నదనీ, అదే మిగతా ప్రదేశాలకన్నా శ్రేష్ఠమైనదని ఏమీ లేదు. బాబా సన్నిధి జ్వాలలాగా ఉంటుంది. ఆ జ్వాల యొక్క వేడి ఎప్పుడూ ఉంటుంది. కానీ అది మనకు అంత సులువుగా అనుభవం కాదు, దానిని ఎప్పుడూ గుర్తించడం వీలుపడదు. ఈ రూము వెనుకప్రక్క ఉన్న బల్బు ముట్టుకుంటే కాలేటంత వేడిగా ఉంటుంది. కావాలంటే తాకి చూడండి. మీకే తెలుస్తుంది. దాని వేడి ఇక్కడ రూము ముందర




మనం కూర్చున్న చోటులో కూడా ఉంది. దానిని గుర్తించేటంత సున్నితత్వం ఉంటే అది మీకు తెలుస్తుంది. అదే విధంగా మీకు ఆ సున్నితత్వం ఉంటే, శిరిడీకి వెళ్లనవసరం లేకుండానే మీరు ఎక్కడున్నా బాబా సన్నిధిని అనుభూతి చెందవచ్చు.

**భక్తుడు :** దగ్గరగా ఉండటం వలన తేడా ఉంటుంది కదా.

**గురువుగారు :** అవును, దగ్గరగా ఉంటే తేడా ఉంటుంది. ఒకవేళ మీరు తేడా లేదనుకుంటే నన్ను చూడటానికి తిరువణ్ణామలై నుండి తిరుమల దాకా ఎందుకు వస్తారు? ఆ తేడా ఏమిటి? మీరే చెప్పండి.

**భక్తుడు :** దగ్గరగా ఉంటే చాలా తేడా ఉంటుంది. సశరీరులైన సద్గురు సమక్షంలో ఉండటం వలన ఆ సన్నిధి ప్రభావం చాలా ప్రస్ఫుటంగా తెలుస్తుంది.

**గురువుగారు :** అవును.

**భక్తుడు :** అయినా, మేము దూరంగా ఉన్నప్పటికీ తేడా సద్గురువు దేహాన్ని వదిలిపెట్టినప్పటికీ ఆయన సన్నిధి ప్రభావమేమీ తగ్గిపోదు.

**గురువుగారు :** అది నిజమే. అయితే మహాత్ములు దేహంతో ఉన్నప్పుడు కూడా వాళ్ళు ఆ దేహానికే పరిమితమై ఉండరు. దేహానికే పరిమితమయ్యి ఉండరు కాబట్టే వాళ్ళు మహాత్ములు. దేహానికే పరిమితమైన (మనలాంటి) వారు సైతం తాము దేహానికే పరిమితం కాము అనే విషయాన్ని తెలుసుకోవడానికి మహాత్ముల దగ్గరకు వెళ్ళాలి. మనం ఈ శరీరం నుండి విముక్తి పొందనంతవరకు, సద్గురు సాన్నిధ్యం, సన్నిధి అవసరమవుతాయి.

**భక్తుడు :** గురువుగారూ! శ్రీరమణమహర్షి సమాధి చెందబోయే ముందు, "అందరూ నేను వెళ్ళిపోతున్నాను అంటున్నారు, కానీ నేను ఎక్కడకు వెళతాను? నేను ఇక్కడే ఉంటాను" అని అన్నారని గ్రంథస్తం చేయబడి ఉంది. 'ఇక్కడ' అంటే 'మనం ఎక్కడుంటే అక్కడ' అని అనుకోవడం సరైనదేనా?

**గురువుగారు :** భగవాన్ ఆ విషయం చెప్పినపుడు, తమ స్థితిని గురించి మాట్లాడటం ఆయన ఉద్దేశ్యం కాదు. తాము తమ దేహాన్ని వదిలిపెట్టబోతున్నారని తెలిసి బాధపడుతున్న భక్తులకు ఓదార్పుగా ఆయనలా అన్నారు. ఆయన సమాధి చెందడమంటే భక్తులకు ఆయన వెళ్లిపోతున్నారని, ఇకపై ఆయనక్కడ ఉండరని. వారిని ఓదార్చడానికి, "నేను ఇక్కడే ఉంటాను" అన్నారు. కానీ మహాత్ములు ఇలా మాట్లాడినపుడు వారి మాటలను ఒకటికన్నా ఎక్కువ స్థాయిలలో అర్ధం చేసుకోవచ్చు. ఒకవేళ మీరు మరింత లోతుగా వెళ్ళి భగవాన్ చెప్పిన మాటలోని గంభీరతను అర్థం చేసుకుంటే, 'ఇక్కడ' అంటే 'ప్రతిచోటా' అని అవగతమవుతుంది. ఆయన మిగతా సందర్భాలలో కూడా ఇలాగే




ప్రతిస్పందిచేవారు. భక్తులు ఆయనను అమెరికాకు ఆహ్వానించినపుడు ఆయనెలా సమాధానం చెప్పారో చదవండి. ఆ సమాధానాలు ఆయన అంతటా ఉన్నారని తెలియచేస్తాయి.


కాబట్టి, ఆయన సమాధి చెందబోతున్నప్పుడు భక్తులందరూ చాలా బాధలో ఉన్నారు, మనిషి స్థాయిలో భగవాన్ వారిని ప్రేమతో, ఆదరంతో "నేను ఎప్పుడూ ఇక్కడే ఉంటాను" అని ఓదార్చారు. కొంచెం లోతైన స్థాయిలో ఆయన తమ నిజస్థితి – అదేమిటో, అదెలా ఉంటుందో తెలియచేస్తున్నారు. మహాత్ముల వాక్కులలో ఆ సందర్భానికి మాత్రమే పరిమితం కానటువంటిది ఇంకేదో ఉంటుంది. ఒక్కో సందర్భానికి ఒక్కో అర్థం సముచితంగా ఉంటుంది. కానీ మీరు ఇంకా లోతుగా వెళితే మీకు మరెన్నో అర్థాలు, అనంతమైన స్థాయిలలో అనంతమైన అర్థాలు దొరుకుతాయి.

**భక్తుడు :** గురువుగారూ! చారిత్రాత్మకమైన సాయిబాబాకు, ఇప్పుడు మనకనుభవమవుతున్న సాయిబాబాకు మధ్య సంబంధం ఏమిటి? బాబా నిజంగా అన్నింటా అంతటా ఉంటే మనం ఇంకా ఎందుకు శిరిడీకి వెళ్తూ, చారిత్రాత్మక పురుషుడైన బాబా గురించి ఆలోచిస్తున్నాం?

**గురువుగారు :** ఎందుకంటే మనం ఇంకా బాబాను ఆ రూపంలో, తలకు కట్టుకున్న గుడ్డ, కఫ్నీ... ఇలాంటి ఆహార్యంతో చూస్తున్నాం – మనకు బాబా అంటే ఇది. బాబాగా మనకు కలిగే అనుభవంలో ఆ రూపానికి సంబంధించిన ప్రతి అంశం కూడా భాగమే.

**భక్తుడు :** ఆయన సాన్నిధ్య భావన కూడానా?

**గురువుగారు :** అవును. సాన్నిధ్య భావన కూడా. మరో విషయమేమిటంటే ఆయనకు సంబంధించిన ప్రతిదీ మనం పవిత్రమైనదనే అంటాము. "ఎవరైతే నేను శిరిడీలో మాత్రమే ఉన్నాననుకొంటారో వారు నన్ను తెలుసుకోనట్లే" అని బాబా చెప్పినప్పటికీ (మనకు) ఆయన శిరిడీలో ఉన్నది మాత్రం నిజం. తమ గురువును అంతగా ప్రేమించిన బాబాకు తమ గురువు అంతటా ఉన్నారన్న విషయం తెలియదా? అయితే బాబా తమ గురుస్థానాన్ని ఎందుకు అంటిపెట్టుకోవలసి వచ్చింది? అరుణాచలేశ్వరుడు సర్వవ్యాపియని, నిజానికి అరుణాచలేశ్వరుడే తన ఆత్మస్వరూపం అని రమణమహర్షికి తెలియదా? ఆయన మధురైలో ఉన్నప్పుడు మాత్రం అక్కడ ఆయన ఆత్మ లేదా? ఆయన తిరువణ్ణామలైకి ఎందుకు రావలసి వచ్చింది? వచ్చిన తరువాత కూడా ఆయన ఇక ఎక్కడికీ వెళ్ళకుండా ఎందుకని తిరువణ్ణామలైతో అంతటి గాఢమైన అనుబంధాన్ని కలిగివున్నారు? తమ ఆత్మస్వరూపాన్ని అంతటా దర్శించిన రమణమహర్షి వంటి మహాత్ములు సైతం తమ సద్గురువు యొక్క రూపంతో అంతటి అనుబంధాన్ని కలిగి ఉన్నారు. ఆయన తమ సద్గురువు గురించి




"అరుణాచలమే నా సద్గురువు" అని చెప్పారు. అలాంటప్పుడు మనబోటివాళ్ళు "శిరిడీలో ఏముంది? బాబా అంతటా ఉన్నారు, శిరిడీ పోవడమెందుకు?" అని మెట్ట వేదాంతం మాట్లాడటంలో అర్థం లేదు!

బాబా అంటే ఆ రూపం కాదు, దానిలో సందేహమేమీ లేదు, ఆ విషయం ఆయనే చెప్పారు. అంతటా నిండిన ఆత్మ స్వరూపమే బాబా అంటే, అది అన్ని జీవుల్లో ఉంది. అది ఆయన నిజ స్వరూపం. ఆ ఆత్మ స్వరూపమే బాబా రూపంలో ప్రకటమయ్యి ఆ విషయాన్ని మన ఎరుకలోనికి తీసుకురావడానికి ప్రయత్నిస్తోంది. ఈ కార్యాన్ని సాధించడానికి అది భిన్నరూపాలు తీసుకుంటుంది. అందులో బాబా ఒక రూపం.

**గురువుగారు :** సగుణరూపం గురించి భయపడవద్దు. ఆ పరమసత్యం నిరాకారమే కావచ్చు, కానీ మనకు ఒక రూపం ఉంది, మనం ఇతర రూపాల మధ్యలో జీవిస్తున్నాం. అలాంటప్పుడు ఎందుకు రూపం అంటే భయపడటం? మనకు నిరాకారం గురించి చెప్పిన వాళ్ళు సైతం రూపంతోనే వచ్చారు కదా? శౌక్యముని బుద్ధునికి కూడా రూపం ఉంది.

**భక్తుడు :** మానవ రూపం దాని గుణాల చేత కట్టుబడిపోతున్నట్లు అనిపిస్తోంది.

**గురువుగారు :** మీకు ఈ సంఘర్షణ కలగడానికి కారణమేమిటంటే నిర్గుణం, నిరాకారం, చరమస్థితి, మానవాతీతమైన ఏకత్వస్థితి మొదలైన విషయాలన్నింటినీ మీరు తలకెక్కించుకోవడమే. అక్కడ మీరు కేవలం ఒకవైపు మాత్రమే చూడగలుగుతున్నారు. మరోవైపు చూడలేరు. కాబట్టి అది మీకు కష్టమవుతోంది. నేను మీకు బాబా అంటే సద్గురుతత్త్వమని చెప్పి ఆయనను నిరాకార స్వరూపుడిగా మరింత అస్పష్టంగా చెయ్యవచ్చు. ఉదాహరణకు, నేను 'బాబా' అని పిలుస్తున్నప్పటికీ దాని నిజమైన అర్థం మాత్రం వారి నిరాకారస్థితే. బాబానే చెప్పినట్లు, "నేను ఈ మూడున్నర అడుగుల దేహాన్నే అనుకుంటే వాళ్ళు నన్నసలు చూడనట్లే" అని నేను చెప్పవచ్చు. కానీ మీ ఆలోచనలకున్న ఒక ప్రత్యేకమైన పరిమితుల వలన నేను మీకు ఈ విషయం చెప్పను. ఎందుకంటే మీకది అవసరం లేదు. కాబట్టి నేను మీకు సాయిబాబా అని చెప్పానంటే అది చారిత్రాత్మకమైన సాయిబాబా గురించే. మీకు ఇప్పుడు అవసరమైనది ఈ మందే. ముందు దీనిని తీసుకోండి, కిటికీని తెలుసుకోండి. అది కేవలం కిటికీ మాత్రమేనని నాకు తెలుసు, మీరు కిటికీని చూసినపుడు నిజానికి మీరు కిటికీ గుండా చూస్తున్నారు. మీరు దేనినైతే నిరాకారం అని పిలుచుకుంటున్నారో దానినే చూస్తున్నారు.

**భక్తుడు :** గురువుగారూ! మీరు ఇచ్చిన కిటికీ ఉదాహరణలో 'ఆకాశం' గురించి నాకు స్పష్టంగా అర్థం కాలేదు. మన లక్ష్యం అంతిమంగా ఆకాశాన్ని చూడటమేనని, గురువు మనకు తెలియచేసేదీ




అదేనని అనిపిస్తోంది. కానీ నేను ఆకాశాన్ని ఎలా చూడాలా? నేను నా అంతరంగంలో చూసుకొని, దానిని గుర్తించి అనుభూతి చెందాలా? అలా అయినప్పుడు నా దృష్టిని ఎక్కడ కేంద్రీకరించాలి? ఆకాశం పట్ల నాకుండే భావనని వాస్తవంగా అనుభవపూర్వకం చేసుకోవడం ఎలా?

**గురువుగారు :** మీరు కిటికీలు లేని గదిలో బంధింపబడి ఊపిరి తీసుకోవడం కూడా కష్టంగా ఉన్నప్పుడు కిటికీ తెరుచుకుంటే ఎక్కడ చూడాలో మీకే తెలుస్తుంది. ఎక్కడ చూడాలో మీకు ఎవ్వరూ చెప్పాల్సిన అవసరంలేదు. ఎందుకంటే మీ స్వంత వ్యక్తిత్వపు పరిమితుల ఒత్తిడితో ఉక్కిరిబిక్కిరవుతూ మీరు ఆతృతగా అన్ని దిక్కులూ వెతుకుతుంటారు. మొదట మీరు విశాల ఆకాశాన్ని అనుభూతి చెందలేరు. మీకున్న పరిమితుల నుండి, ఊపిరి తీసుకోవడం కష్టంగా ఉన్న ఆ స్థితి నుండి బయటపడాలనుకుంటారు. కాబట్టి మీకు తక్షణ ఉపశమనం కిటికీ నుండే లభిస్తుంది. మీరు కిటికీనే ఇష్టపడటం మొదలుపెడతారు. దానికి దగ్గరగా ఉండాలనుకుంటారు. కిటికీకి దగ్గరగా కుర్చీ వేసుకుని కూర్చుని దాని వంకే చూస్తూ దాని నుండి వచ్చే చల్లగాలిని ఆస్వాదిస్తూ ఉంటారు. ఆ తర్వాత నెమ్మదిగా వెలుపలికి దృష్టి సారించి ఆకాశాన్ని చూస్తారు. "ఆకాశం అంటే ఏమిటి?" అని ఆలోచించడం మొదలుపెడతారు. కొన్నాళ్ళకు, ఆకాశం చూడటానికి కిటికీ రూపంలో కనిపిస్తున్నప్పటికీ వాస్తవానికి మీరు చూస్తున్నది పరిధులు లేని అనంతతత్వాన్ననే విషయం తెలుసుకుంటారు. ఇది క్రమంగా వివిధ దశలలో జరుగుతుంది. ఎందుకంటే మీరు ఆ చల్లగాలిని అనుభూతి చెందిన తరువాత కూడా గోడలను తడుముకునే మీ పాత అలవాటు కారణంగా మీరు వెనక్కి వెళ్ళి ఒక మూల కూర్చుంటారు (నవ్వులు...) మళ్ళీ మీకు ఊపిరి ఆడనపుడు కిటికీ వద్దకు వెళ్ళి చల్లగాలిని పీల్చుకుంటారు. ఆ తరువాత ఒక అరగంటకి మీకది పాతబడిపోతుంది. మళ్ళీ వెనక్కి వెళ్ళి మూలకూర్చుంటారు.

మీరు కిటికీ నుండి దూరంగా వెళ్ళిపోయి ఊపిరాడని స్థితిని అనుభవించాలి. అప్పుడే మీరు తిరిగి వచ్చినప్పుడు ఆ ఆకాశం యొక్క విశాలత్వంలోని గొప్పతనాన్ని అనుభవించగలుగుతారు. ఇంకా చెప్పాలంటే కిటికీ దగ్గర ఉండటం మాత్రమే కాదు, ఆ గది బయటకు కూడా వెళ్లాలని ఉంటుంది. మనం లోపలే ఎందుకుండాలి? వెలుపలికి వెళ్దాం! అప్పుడు మనకు ఊపిరి ఆడకపోవడమనేదే ఉండదు. ఇక కిటికీ అవసరం కూడా ఉండదు. కిటికీ తన కోసం తానులేదు, అది మనకు వెలుపల ఉన్న వాస్తవాన్ని చూపించడానికి ఒక ద్వారంలాగానే ఉంది.

# గురుకృపాలహరి




**శ్రుతి స్మృతి పురాణోక్త ధర్మమార్గరతం గురుం - భక్తానాం హితవక్తారం నమస్యే చిత్తశుద్ధయే**

**కర్మ భక్తి జ్ఞానమార్గప్రచారే బద్ధకంకణం - అనుగ్రహ ప్రదాతారం నమస్యే చిత్తశుద్ధయే॥**

అనుగ్రహ సుధా జలధి గురువు – భగవంతుని చరణాలను చేర్చేందుకు సారధి గురువు. ఇహపర శ్రేయములకు వారధి గురువు – 'నడయాడే దైవత్వపు' సన్నిధియే గురువు. మానవ జీవితమంత అందమైన తావు జగత్తున లేదు కదా! లక్షల జీవరాశులుంటే కేవలం మనకు మాత్రమే 'బుద్ధి' కలిగింది. 'బుద్ధి'తో మనలో 'శుద్ధి' కలగదన్న తలంపు కలిగిందో లేదో 'దైవం' – 'గురువు' రూపంలో భాసించడం జరిగింది. అసంకల్పితంగా, అవ్యాజంగా! 'పరిణామ'క్రమంలో ప్రతి జీవి ప్రకృతితో కలసి సాగాల్సిందే కదా! ఈ రోజు విత్తనం నాటి మరునాడు ఫలాలను కోసుకోవడం సాధ్యమా! ఫలాలను, జీవన సాఫల్యాలను ప్రతిఫలాపేక్ష లేకుండా అందించేవారు గురువు. అపారమైన ఆధ్యాత్మిక, మానసిక, వైజ్ఞానిక, వేద, ఇతిహాస, ధర్మ మార్గాలను అవపోసన పట్టి భక్తుల మనో మాలిన్యాలను శుద్ధి చేసి హితమైనది మాత్రమే అందించే అమృతమూర్తి గురువు. పనిచెయ్యి, సద్గ్రంధాలు చదువు, దేవుని నామం ఉచ్ఛరించు అంటూ కర్మ, జ్ఞాన, భక్తి మార్గాలను సరళతరం చేసి అనుక్షణం అనుగ్రహించే అపార కరుణావరుణుడు గురువు. అట్టి గురువరేణ్యులలో నిత్య స్మరణీయులు శ్రీచంద్రశేఖరసరస్వతీ స్వామివారు. దక్షిణాపథాన రామ, సాయిస్వరూపాలతోపాటు పెక్కు గృహసీమలలో ఆచార్యులవారి రూపం మనమందరం కాంచడం కద్దు.


గురుబంధువుల్లారా! నన్ను నేను విశ్లేషించుకున్నాను – పరమాచార్యుల వారి జీవిత ప్రస్థానం మనందరికీ ఉపయోగమా? ఎలా అని? భావశుద్ధి, క్షేత్రశుద్ధి మనలను లక్ష్యసిద్ధివైపుగా మరల్చుతుందన్నది నిస్సందేహం. అస్మదాచార్య (స్వగురువు) దర్శనం – అస్మదాచార్య స్మరణం – ఇవి రెండు మాత్రమే స్ఫురణకు వచ్చాయి. ఎందరో మహానుభావులు... అందరికీ వందనాలు.. శ్రీసాయి అంటేనే సకల సాధు స్వరూపము. అందరు మహాత్ములలోనూ దర్శనమిచ్చే భిన్న దృక్పధాలు వారి వారి గురు స్వరూపంలోనూ దర్శించుకోవడం సహజమే కదా! అంత మాత్రాన మహాత్ములలో ఎక్కువ–తక్కువలు కానరాదు. ఇక్కడ వ్యక్తమయ్యేది తత్త్వమే కానీ వ్యక్తి కాదు. చిన్నతనంలో ఊహ తెలిసేంతవరకు తల్లి–బిడ్డను రకరకాల దుస్తులలో అలంకరించి ఆనందిస్తుంది. పెద్దయ్యాక బిడ్డ ఊరుకుంటుందా! తల్లిని కూడా అలా రకరకాల దుస్తుల్లో చూడాలని ఆశిస్తుంది. మనందరి తండ్రి, తల్లి సద్గురువే!




**పరిపరివిధాల పరివేష్టితుడైన భగవతత్త్వాన్ని పరిపూర్ణంగా తమ సద్గురువులో దర్శించుకోగలగడమే నిజమైన దర్శనం... అందుభాగంగానే ఈ ప్రయత్నం.** స్వాములలో సామ్యము నన్ను కట్టిపడేసింది. తాము నమ్మిన ఆశయం కోసం, ఆదర్శాల కోసం వారి గురుదేవుల అడుగుజాడల కోసం వారిలో ఉన్న 'నిష్ఠ' – 'సబూరీ'లు మనలో లవలేశమైనా అంకురించగలిగితే అది ఆహ్వానించదగ్గ పరిణామమే.

శంకరులు ఒకచోట అంటారు అంబికను వర్ణిస్తూ 'అనుపమాన' అంటూ అంటే వర్ణించడానికి ఉపమానము (పోలిక) లేదు అని. అనుపమాన అవతార వరిష్టులు చంద్రశేఖరులు, 'శరత్‌చంద్ర' శేఖరులు. ఇద్దరూ అవతార పురుషులే! ఇద్దరూ మూర్తీభవించిన జ్ఞాన భాస్కరులే! ఇద్దరూ తపః సంపన్నులే. ఇద్దరూ మానుషరూపేణా దైవాలే! ఇద్దరూ నవీన–ప్రాచీనముల మేలితావులే! ఇద్దరూ ఆశయసిద్ధికై అలుపెరుగని శ్రామికులే! ఇద్దరూ అద్వైతులే (ఆలోచించండి)! ఇద్దరూ గురు'పరంపరా'గతులే! ఇద్దరూ 'యద్యదాచరతి శ్రేష్టః' అంటూ భాసించే ఆచార్యులే. ఇద్దరూ సజ్జన 'హృదయపీఠాధిపతులే'! ఇద్దరూ త్రికాలదర్శులే! ఇద్దరూ తత్త్వదర్శులే! ఇద్దరూ జిజ్ఞాసువులకు మార్గదర్శులే! ఇద్దరూ లీలామానుషులే! ఇద్దరి స్వరూపమూ మౌనమే. ఇద్దరూ మాట్లాడిరా అది మానవ జీవన వేదమే. ఇద్దరూ కర్మ, భక్తి, జ్ఞానములకు మూర్తిస్వరూపులే. ఇద్దరూ కల్లోల మానసములకు అభయ, శాంతి ప్రదాతలే. ఇద్దరూ భక్తసులభులే! ఇద్దరూ ఆశ్రిత రక్షణకై 'విధిని' మార్చగల్గిన విరాట్ స్వరూపులే! ఇద్దరూ నియమపాలనమున నియంతలే! ఇద్దరి చరణకమలాలు గంగా, భాగీరథులే! ఇద్దరూ సద్గురుచంద్రులే! ఇద్దరూ జగద్వంద్యులే!

సద్గురు చంద్రుల కలయిక మరో సచ్చరిత్రే కదా! 'పెద్దాయన'గా పిలుచుకునే చంద్రశేఖరుల ఆప్యాయత, సాయిదీవెనలివిగో– "శ్రీబాబూజీ పూండీ నుండి వస్తూ మధ్యలో 'పెరియవర్' (పెద్దాయన) అని, 'నడమడందైవం' (నడయాడే దైవం) అని, 'కంచిపెద్దస్వామి' అని భక్తులు ప్రేమగా పిలిచే కంచి పీఠాధిపతి శ్రీ చంద్రశేఖర సరస్వతీ స్వామివారి దగ్గరకు వెళ్ళారు. అప్పుడు స్వామివారిని దర్శించుకోవడానికి పండితుల బృందం వచ్చింది. ఆ బృందం వెనుక బాబూజీ ఉన్నారు. అక్కడున్న వారినందరినీ స్వామివారు కలియజూస్తూ, వెనుకనున్న శ్రీబాబూజీని ముందుకు పిలిచి, ఆప్యాయంగా చూస్తూ దుబాసీద్వారా శ్రీబాబూజీ వ్యక్తిగత వివరాలన్నింటినీ అడిగి తెలుసుకున్నారు. మాటలమధ్యలో పూండీ నుండి వస్తున్నారని తెలిసి ఎంతో సంతోషించి ఆశీర్వదించారు. శ్రీబాబూజీతో మాట్లాడిన తరువాత ఇంకెవరితోనూ మాట్లాడకుండా స్వామివారు ధ్యానస్థులయ్యారు. అన్ని వివరాలను శ్రీబాబూజీ




నుండి అడిగి తెలుసుకొనడం చూసి అక్కడున్న వారందరూ ఆశ్చర్యపోయారు. బాబా ముద్దుబిడ్డయైన శ్రీబాబూజీ ఎక్కడకు వెళ్ళినా ఓ ప్రత్యేకమైన ఆత్మీయాభిమానాన్ని మహాత్ములు చూపేవారు".

చంద్రశేఖరుల ఆత్మీయాభిమానము – తపఃసంపన్నులైన శరశ్చంద్రుల జిజ్ఞాసా వైభవము మనకు మార్గదర్శకం అవ్వాలని ఆశిద్దాం, ప్రార్ధిద్దాం. ఓ వంక తన చెంతకు చేరే ప్రతి జీవి ఈశ్వర సంకల్పానుసారమే వస్తారన్న చంద్రశేఖరుల ఆదర్శము, మరో వంక భాసించే ప్రతి జీవి శ్రీసాయి స్వస్వరూపమేనన్న గురుచంద్రుల 'దర్శనా'భిలాష.తమ మనఃచక్షువులతో ఈ సంఘటనను దర్శించిన జీవుల జన్మ ధన్యము.

కేవలం మాటల్లో జ్ఞానస్వరూపులు, అందరిలోనూ తమతమ సద్గురువునే దర్శిస్తారు అంటే సరిపోతుందా! 'జ్ఞానం' అంటే ఏమిటి? జ్ఞానం ఎందుకు – జ్ఞానంతోనే మనుష్యజన్మకు శోభ 'భూషలు కావు మర్త్యులకు భూరిమయాంగద తారహారముల్" మానవజన్మకు జ్ఞానమే మహాభూషణం. జ్ఞానం వికసించే కొలదీ మానవజన్మ శ్రేష్ఠత హెచ్చుతుంది. అన్ని క్షేత్రములలోనూ ఒకే క్షేత్రజ్ఞుణ్ణి చూడటం జ్ఞానం. అనగా భిన్న భిన్న క్షేత్రాలలో, ఉపాధులలో అభిన్నమైన క్షేత్ర పురుషుణ్ణి చూడటం జ్ఞానం. అట్టి 'జ్ఞానం' కలగడానికి సాధనా మార్గం అనుసరణీయమైనది. నిజానికి తాము మూర్తీభవించిన 'జ్ఞానము' అయినా తాము కూడా సాధనా స్వరూపులుగా, సాధకులుగానే దర్శనమిస్తారు గురువు. సద్గురు చంద్రుల స్మరణ మనోక్షేత్రాలను సుభిక్షం చేస్తుండగా గురుకృపాలహరిలో ముందుకు సాగుదాం. శ్రీచంద్రశేఖరసరస్వతి అను నామధేయముతో విలసిల్లిన కంచి పీఠాధిపతుల పూర్వాశ్రమ నామధేయము 'స్వామినాథన్'. తమిళనాట, దక్షిణ ఆర్కాట్ జిల్లా విల్లుపురంలో సుబ్రహ్మణ్యశాస్త్రి, మహాలక్ష్మి పుణ్యదంపుతులకు భగవదనుగ్రహ ప్రసాదంగా మే 20వ తేదీ, 1894వ సం॥లో స్వామిమలైలోని 'స్వామినాధుని' ఆశీఃప్రసాదంగా జన్మించారు. కనుక స్వామినాధుడన్న నామధేయంతో వారి కృతజ్ఞతను తెలియచేసుకున్నారు ఆ దంపతులు. నలుగురు కుమారులు, ఒక కుమార్తెతో సుబ్రహ్మణ్యశాస్త్రిగారి కుటుంబం సంతోషాల నిలయంగా సాగేది. స్వామినాధునికి – గణపతిశాస్త్రిగారు అన్న, సాంబమూర్తిశాస్త్రి, సదాశివశాస్త్రి, కృష్ణమూర్తి శాస్త్రి తమ్ములు, లలితాంబిక చెల్లెలు. ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగిన తండ్రిగారు కొంతకాలానికి విద్యాశాఖలోనే సూపర్‌వైజర్‌గా కొనసాగారు. తల్లి మహాలక్ష్మిగారు దొడ్డ మనసుగలది. తమిళ, తెలుగు, సంస్కృత స్తోత్రాలలోను, ప్రార్ధనలలోను ఆమెకు ప్రవేశముంది. భర్త అవసరాలను, బిడ్డల బాగోగులను అత్యంత శ్రద్ధగా చూసుకునేవారు.



వివేకానందుడు ఎంతోమందిని మీరు దైవాన్ని చూసారా? అని అడిగాడు. ఎవరూ ఆయనకు సూటిగా జవాబు చెప్పలేదు. ఒక్క శ్రీరామకృష్ణ పరమహంస “చూసాను, చూస్తున్నాను,నీకూ చూపగలను” అన్నారు. అలా అంటూనే నరేంద్రుని హృదయస్థానాన్ని చిన్నగా స్పృశించి సమాధిస్థితిని, దైవానుభవాన్నీ ఒకే క్షణంలో ప్రసాదించారు. అందుకే గురుపథం అంటే అనుభూతి ప్రదం అంటారు. ఆ అనుభవాన్ని అంటిపెట్టుకున్న దానికి గురుతే వివేకానందుని ప్రవర్తన. ఆయనకు శ్రీరామకృష్ణులు దైవం అయ్యారు. అందరూ తమకు రామకృష్ణుల వంటి గురువు కావాలని అనుకుంటారు. అలా ఆశించడంలో తప్పలేదు కానీ, తమకు వివేకానందునికున్న లక్షణాలున్నాయా (తపన, ఆర్తి, అన్వేషణ) అని మాత్రం ఎవరూ ఆలోచించరు.

రమణులను ఒకతను చాలా రోజుల నుంచి ‘మాయ’ అంటే ఏమిటి అని అడుగుతూ ఉండేవాడు. మహర్షి ఏమీ చెప్పేవారు కాదు. మౌనంగా ఉండేవారు. ఇలా ఉండగా ఒకరోజున రాష్ట్రపతిగా ఉన్న బాబూ రాజేంద్రప్రసాద్ మహర్షి దర్శనార్థమై వచ్చారు. ఆశ్రమవాసులందరూ హడావుడి చేసారు. మహర్షి ముఖంలో మాత్రం ఏ మార్పు లేదు. ఒక సామాన్యుడు వస్తే ఎలా ఉంటారో, రాష్ట్రపతి వచ్చినా అలాగే ఉన్నారు. రాజేంద్రప్రసాద్‌గారు మహర్షి సమక్షంలో మౌనంగా కూర్చున్నారు. దర్శనం అయిన తరువాత రాష్ట్రపతి వెళ్ళేప్పుడు అందరూ ఆయనకు వీడ్కోలు ఇవ్వడానికి పాలోమంటూ పరిగెత్తిపోయారు. మహర్షి దగ్గర ఎవ్వరూ లేరు. సందేహం అడిగిన వ్యక్తి ఒక్కడే ఉన్నాడు. అప్పుడు మహర్షి అతనితో “మాయ” అంటే ఇదే’ అని ఒక్క మాట మాత్రం చెప్పారు. వారు అసలైన గురువులు. (నేను ఏదీ బోధించను. నేర్చుకునేటట్లు చేస్తాను. -శ్రీబాబూజీ)

అలా గురువు చెప్పినదేమిటో మనం అర్థం చేసుకోవాలి. దానిని జీవితంలో ఆచరించాలి. అనుభవాన్ని పొందాలి, అంతేగానీ, ఉత్సవాలు చేసినంత మాత్రాన ఏమీ ప్రయోజనం లేదు, మనుషుల జీవితాల్లో మార్పు రావాలి. వ్యక్తిత్వాలు ఉన్నతంగా (పరిణితి) ఎదగాలి. మనుషుల్లో దైవత్వం నిండాలి. (మనిషి దైవంగా పెరగడం బాబా మతం అంటారు శ్రీబాబూజీ). బోధలు మాటలలోకాదు, చేతల్లో ప్రతిఫలించాలి. అందుకే అంటారు “మన కోరికలు తీర్చడంలో పరివర్తననే బాబా ఆశిస్తున్నది” అంటారు శ్రీబాబూజీ. మనం పరివర్తన చెందాలి, మనలో పరిణతి రావాలి, పరిపూర్ణతవైపు అడుగులు వేయాలి, అదే ఆయన ఆశిస్తున్నది మననుండి... ఆచరణలు నిత్యజీవనంలో నిరూపించబడాలి (ఎవరైతే అంతటా అన్నిటా వున్న నన్ను గుర్తించి అనుగుణంగా మసలుకుంటారో వారు నాకు ప్రీతిపాత్రులు. -శ్రీసాయి). అప్పడే గురువు ఆనందిస్తారు. వారు ఆనందించినపుడే నిజమైన ‘గురుపూర్ణిమ’.

గురువు నడిచి చూపిన బాటన నడిచేందుకు ఆచరణతో ఉపదేశించిన సాధనను విశ్వాసంతో, తదేక నిష్ఠతో అభ్యసించి, ఆచరించి ఫలాలను పొంది గురువుకి ఆనందాన్ని కలిగించిననాడే మనకు నిజమైన ‘గురుపూర్ణిమ’.

భగవంతుడు కూడా అప్పడే ఆనందించేది. ఎవరైతే నిరంతరం ఆనందంగా ఉంటూ, ఆనందాన్ని పంచుతుంటారో, వారు సాయిపథంలో ఉన్నవారు అంటారు శ్రీబాబూజీ. అందుకే సాయిపథం ఆనందపథం అంటారు శ్రీబాబూజీ. నా పెదవులపై చిరునవ్వు చెదరలేదు, మీ పెదవులపై చెదరరాదు అంటారు శ్రీ ఎక్కిరాల కృష్ణమాచార్యులు.

- గురుకృప



గురుచరణం... సద్గురు చరణం... సాయి చరణం... మమశరణం

కామితార్థ ప్రద  గురుచరణం...
నిరుపమ తేజం  గురుచరణం...
భవాపితరణం  గురుచరణం...
శ్రీకర, శుభకర గురుచరణం...
సుందర శోభిత గురుచరణం...



పరమానందం గురుచరణం...
పరమ పవిత్రం గురుచరణం...
భవభయహరణం గురుచరణం...
పరమపావనం గురుచరణం...
సచ్చిదానందం గురుచరణం...

గురుచరణం... సద్గురు చరణం... సాయి చరణం... మమశరణం